epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

SAMAYAM



epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**



సంపుటి: 19 | సంచిక: 285 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |




# కొండా సురేఖ బర్తరఫ్

## నన్ను తొలగించడం సీఎం కుట్రే

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో సురేఖ
- అధిష్టానానికి పంపిన లేఖ కొండా రిలీజ్

.. వివరాలు 2లో

- మంత్రివర్గం నుంచి ఉద్వాసన
- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది.

## కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

- సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
- ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
- కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్
- బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

.. వివరాలు 2లో





## ఏ దేశమూ ఇరాన్‌కు సాయం చేయొద్దు

- అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం
- సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీలో వ్యాఖ్యలు

4

ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## నల్సార్ విద్యార్థులకు సుప్రీం ఊరట



- విద్యార్థులపై చర్యలకు బీసీఐకి అధికారం లేదు
- న్యాయవాదులుగా నమోదైన వారికే అధికార పరిధి
- బీసీఐ వైఖరిని తప్పుబట్టిన సుప్రీంకోర్టు
- 2026 బ్యాచ్‌పై ఆంక్షలతో చెలరేగిన వివాదం
- సుమోటో విచారణలో కీలక స్పష్టత

2

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్‌కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. బీసీఐ అధికార పరిధి న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారిపై ఆ అధికారాన్ని ప్రయోగించలేదని పేర్కొంది. ఈ మేరకు నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు భారీ ఊరటనిచ్చేలా కీలక స్పష్టత ఇచ్చింది.

## రామ మందిర్ సీఈవో నియామకంపై రాజకీయం

కాంగ్రెస్ అనుమానాలు.. బీజేపీ ఘాటు ప్రత్యుత్తరం



4

అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తొలి సీఈఓగా భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకంపై దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది. సైనిక అధికారికి రామ మందిర ట్రస్ట్ బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేయగా, బీజేపీ సైతం అంతే ఘాటుగా ఎదురుదాడికి దిగింది.


## కర్రెగుట్టల్లో మందుపాతర పేలి గిరిజనుడి మృతి


- వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లి విషాదం
- మృతుడు వెదుల్లచెరువుకు చెందిన మడకం నాగేశ్వరరావు
- పాత మందుపాతరగా అనుమానిస్తున్న పోలీసులు
- అటవీ ప్రాంతంలో విస్తృతంగా కూంబింగ్

3



# రేప్ కేసుల సెటిల్‌మెంట్ దందా







- పంజాబ్ సీఎం మాన్, ఆయన భార్యపై బీజేపీ తీవ్ర ఆరోపణలు
- ఒక్కో కేసుకు రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్య
- ఆడియో క్లిప్పులు విడుదల చేసిన ప్రదీప్ భండారీ
- ఆరోపణలను ఖండించిన గుర్‌ప్రీత్ కౌర్
- దర్యాప్తు వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు

2

పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆయన భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అత్యాచారం సహా క్రిమినల్ కేసులను మధ్యవర్తుల ద్వారా డబ్బులు తీసుకుని సెటిల్ చేస్తున్నారంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. ఒక్కో కేసు పరిష్కారానికి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను గుర్‌ప్రీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదీప్ భండారీ కొన్ని ఆడియో క్లిప్పులను విడుదల చేశారు. వాటిలో ఓ వ్యక్తి తనకున్న రాజకీయ పరిచయాలను ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను సెటిల్ చేయడం గురించి మాట్లాడినట్లు ఉందని ఆయన పేర్కొన్నారు.

## మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి



- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి
- బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

3

# కొండా సురేఖ బర్తరఫ్

## మంత్రివర్గం నుంచి ఉద్వాసన

## రాజీనామాకు నిరాకరించిన సురేఖ

## బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్

## గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ

## సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..

## చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

**హైదరాబాద్,సెప్టెంబర్3 :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది.



సురేఖ న్యూదిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.



# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

## సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్

## ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి

## రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద

## కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్

## బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

# నన్ను తొలగించడం సీఎం కుట్రే

## బర్తరఫ్ పై మీడియా సమావేశంలో సురేఖ

## అధిష్టానానికి పంపిన లేఖ కొండా రిలీజ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** మంత్రి పదవి నుంచి తనను తొలగించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర ఉందని కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. తనను మంత్రివర్గం నుంచి తొలగించకపోతే తానే తప్పుకొంటాననంటూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. "నన్ను బర్తరఫ్ చేస్తారా?.. నన్నే వెళ్లిపొమ్మంటారా?" అంటూ అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేసి తనను తొలగించేలా చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తాను కాంగ్రెస్‌ను వీడే ఆలోచనలో లేనని, పార్టీపై తన విశ్వాసం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తన తొలగింపుపై గురువారం మీడియాతో మాట్లాడిన సురేఖ.. కనీసం తన వివరణ కూడా తీసుకోకుండా నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. రాజీనామా చేయాలని తనను ఎవరూ అడగలేదని, అధిష్ఠానం నుంచి ముందస్తుగా ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. "ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారు. కానీ నా విషయంలో కనీసం వివరణ కూడా అడగలేదు. పదవి పోయిందనే బాధ నాకు లేదు. కారణం చెప్పకుండా అవమానకరంగా తొలగించడమే బాధిస్తోంది" అని సురేఖ వ్యాఖ్యానించారు. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడాన్ని సురేఖ తప్పుబట్టారు. సుస్మితకు స్వతంత్ర వ్యక్తిత్వం ఉందని, ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము ఆ వ్యాఖ్యలు చేయించలేదని స్పష్టం చేశారు. సుస్మిత వ్యాఖ్యలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఇతర కాంగ్రెస్ నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుందని నిలదీశారు. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో ముఖ్యమంత్రి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించిన నాయకుడు రేవంత్‌రెడ్డేనని సురేఖ చెప్పారు. ఆయన పీసీసీ అధ్యక్షుడు కావాలని, ముఖ్యమంత్రి కావాలని కోరుకున్న వారిలో తాను ముందున్నానన్నారు. అయినప్పటికీ తనపై కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు కుట్ర చేశారని ఆరోపించారు. తనతో పాటు తన మాజీ ఓఎస్‌డీ సుమంత్ కుటుంబాన్ని కూడా కావాలనే వేధించారని విమర్శించారు. సుమంత్‌పై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రిగా ఉన్నప్పటికీ తనకు పూర్తి అధికారాలు లేకుండా చేశారని సురేఖ ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తన ప్రమేయం లేకుండానే జరిగాయని చెప్పారు. తనకు తెలియకుండానే మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను తొలగించారని పేర్కొన్నారు. తన శాఖకు సంబంధించిన వ్యవహారాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, దేవాదాయ శాఖ అధికారులతో ఆయన సమీక్షలు నిర్వహించినా తనకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి విషయంలోనూ వివక్ష చూపారని విమర్శించారు. "మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెలపై చేయి వేసుకుని చెప్పాలి. ఎమ్మెల్యేలు, మంత్రుల్లో అసంతృప్తి ఉందన్న విషయం అందరికీ తెలుసు. పనులు జరగాలంటే ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉంది" అని సురేఖ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉందని కూడా ఆమె పేర్కొన్నారు. తనపై చర్యలకు ముందే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు రాసిన వివరణాత్మక లేఖను సురేఖ మీడియాకు విడుదల చేశారు. ఆగస్టు 23న రాసినట్లు పేర్కొన్న ఆ లేఖలో బీసీ మహిళా మంత్రిగా తాను రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. 31 ఏళ్ల రాజకీయ ప్రస్థానం, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తన అధికారాలను క్రమంగా కుదించారని లేఖలో ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే నేరుగా వెలువడుతున్నాయని పేర్కొన్నారు. యాదాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు విషయంలో తనను సంప్రదించలేదని, సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులను రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫొటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



వరంగల్ తూర్పులో స్మార్ట్ సిటీ, మోడల్ బస్‌స్టాండ్, బొందివాగు విస్తరణ తదితర అభివృద్ధి పనులకు నిధులు ఆలస్యమవుతున్నాయని కూడా లేఖలో ప్రస్తావించారు. తన ఆరోపణలకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను సైతం అధిష్ఠానానికి అందించినట్లు తెలిపారు. తన తదుపరి కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సురేఖ స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలపై తమకు అభిమానం ఉందన్నారు. కాంగ్రెస్‌పై తన విశ్వాసం చెక్కుచెదరలేదని చెప్పారు. అయితే సురేఖ ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేయవచ్చంటూ రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. బీజేపీ నుంచి ఆహ్వానం అందిందని, బీఆర్ఎస్ వైపు వెళ్లవచ్చని కూడా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. వీటిపై సురేఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అందువల్ల ఆమె భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై వస్తున్న ప్రచారాన్ని ప్రస్తుతానికి ఊహాగానంగానే చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సురేఖను తమ పార్టీలోకి రావాలని బహిరంగంగా ఆహ్వానించారు. "మీ కోసం ప్రజాశాంతి పార్టీ ఉంది.. వేరే పార్టీలోకి వెళ్లకండి" అని వీడియో సందేశంలో కోరారు. కాంగ్రెస్‌లో బీసీ నాయకులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. బీసీలు, బడుగు బలహీన వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మొత్తంగా మంత్రి పదవి నుంచి తన తొలగింపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమంటూ కొండా సురేఖ నేరుగా ఆరోపించడం.. అదే సమయంలో కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. ఇప్పుడు ఆమె తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్నదే ఉత్కంఠగా మారింది.

# రేప్ కేసుల సెటిల్‌మెంట్ దందా

## పంజాబ్ సీఎం మాన్, ఆయన భార్యపై బీజేపీ తీవ్ర ఆరోపణలు

## ఒక్కో కేసుకు రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్య

## ఆడియో క్లిప్పులు విడుదల చేసిన ప్రదీప్ భండారీ

## ఆరోపణలను ఖండించిన గుర్‌ప్రీత్ కౌర్

## దర్యాప్తు వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు




**చండీగఢ్:** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అత్యాచారం సహా క్రిమినల్ కేసులను మధ్యవర్తుల ద్వారా డబ్బులు తీసుకుని సెటిల్ చేస్తున్నారంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. ఒక్కో కేసు పరిష్కారానికి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను గుర్‌ప్రీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదీప్ భండారీ కొన్ని ఆడియో క్లిప్పులను విడుదల చేశారు. వాటిలో ఓ వ్యక్తి తనకున్న రాజకీయ పరిచయాలను ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను సెటిల్ చేయడం గురించి మాట్లాడినట్లు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆడియోల ప్రామాణికత, వాటిలోని సంభాషణలకు ముఖ్యమంత్రి లేదా ఆయన కుటుంబంతో ప్రత్యక్ష సంబంధం ఉందా అన్న అంశాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

### 'రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారా?'

మధ్యవర్తుల ద్వారా కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని భండారీ ఆరోపించారు. సీఎం వ్యక్తిగతంగా కేసుల విషయంలో జోక్యం చేసుకుంటున్నారా? ముఖ్యమంత్రి నివాసం కేంద్రంగా ఏమైనా ఒప్పందాలు జరుగుతున్నాయా? అంటూ ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పైనా ఆయన ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలకు స్వతంత్ర నిర్ధారణ లేదు.

### ఏమిటీ కేసు?

సామాజిక మాధ్యమ ప్రభావశీలి గుర్వీందర్ సింగ్ చాహల్‌కు సంబంధించిన అత్యాచారం కేసు నేపథ్యంలో తాజా రాజకీయ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారన్న ఆరోపణలపై చాహల్‌పై కేసు నమోదైంది. ఏప్రిల్ 29న అమృత్‌సర్‌లో కేసు నమోదు కాగా, మే 1న బాధితురాలిని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అనంతరం అత్యాచారం ఆరోపణలను కేసులో చేర్చారు. మే 13న చాహల్‌ను అరెస్టు చేయగా.. తర్వాత ఆయన విడుదల కావడంతో దర్యాప్తు తీరుపై రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. బాధితురాలి తండ్రి పంజాబ్-హర్యానా హైకోర్టును ఆశ్రయించి దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో జూలై 20న గత దర్యాప్తుతో సంబంధం లేకుండా సీనియర్ పోలీసు అధికారితో విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం.

### మానవ హక్కుల కమిషన్ దృష్టికి

కేసును సెటిల్ చేసేందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలు ఆగస్టులో జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి



వెళ్లాయి. దీనిపై విచారణ జరిపి తీసుకున్న చర్యల నివేదిక సమర్పించాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని కమిషన్ ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను సీఎం భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్ ఖండించారు. ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకునేందుకే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సిమ్రంజిత్ సింగ్ హుండాల్ కూడా తాను గుర్‌ప్రీత్ కౌర్‌ను ఎప్పుడూ కలవలేదని స్పష్టం చేశారు. బీజేపీ చేస్తున్న తీవ్ర ఆరోపణలు, మరోవైపు వాటిని సీఎం కుటుంబం ఖండిస్తున్న నేపథ్యంలో.. ఆడియో క్లిప్పుల ప్రామాణికతతో పాటు రూ.5 కోట్ల 'సెటిల్‌మెంట్' ఆరోపణల్లో వాస్తవాలేమిటన్నది అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# రైతు డిక్లరేషన్ హామీలేమయ్యాయి?

- 33 హామీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- రుణమాఫీ.. రైతుబంధులో మోసం చేశారని విమర్శ
- సాగర్ ఎడమ కాలువకు నీళ్లివ్వాలని డిమాండ్
- సెప్టెంబర్ 14లోగా షెడ్యూల్ ప్రకటించాలని అల్టిమేటం
- లేదంటే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర



మిర్యాలగూడ, సెప్టెంబర్ 3: ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లోని హామీలు ఏమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు పెంపు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, పంటలకు బోనస్ వంటి హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద పంటలకు నీరందించే షెడ్యూల్‌ను సెప్టెంబర్ 14లోగా ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. మిర్యాలగూడలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో కేటీఆర్ మాట్లాడారు. 2022లో వరంగల్ వేదికగా ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ఇస్తే తాము రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తుచేశారు. కౌలు రైతులకూ పెట్టుబడి సాయం, వరి, పత్తికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణలో రైతుబంధును మూడు విడతల్లో ఎగ్గొట్టిందెవరని కేటీఆర్ ప్రశ్నించారు. రుణమాఫీ, బోనస్, రైతుబీమా విషయంలోనూ రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులు ఇబ్బందులు పడతారని కేసీఆర్ ఎన్నికల సమయంలోనే హెచ్చరించారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో రైతులకు యూరియా అందుబాటులో ఉండేదని, ఇప్పుడు ఎరువుల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు, దళితబంధు వంటి పథకాలు నిలిచిపోతాయని కేసీఆర్ చెప్పిన మాటలు నిజమవుతున్నాయని వ్యాఖ్యానించారు. మిర్యాలగూడను 'తెలంగాణ రైస్‌బౌల్'గా తీర్చిదిద్దామని కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటి ప్రాంతంలో ఇప్పుడు రైతుల కోసం మహాధర్నా నిర్వహించాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. కృష్ణా జలాల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను కాపాడటం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణకు రావాల్సిన నీటి విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటి తరలింపుపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

### '14లోగా నీళ్లివ్వండి.. లేదంటే పాదయాత్ర'

నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 14లోగా నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. ఎప్పుడు నీరు విడుదల చేస్తారు? ఎన్ని తడులకు నీరు ఇస్తారు? ఎంత మేర అందిస్తారు? అనే వివరాలను రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు. అలా చేయకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. 2003లో సాగునీటి కోసం కేసీఆర్ ఇదే మార్గంలో పాదయాత్ర చేసి అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని గుర్తుచేశారు. రైతులకు నీరందించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

- అక్రమ దత్తతకు వీలులేదు
- రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు




**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబంధించిన వివరాలపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. 2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రూల్స్‌కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్‌తో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయిలు వర్చువల్‌గా హాజరై సమాధానాలిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా హైకోర్టు నియమిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా సమాధానమిస్తూ అనాథలను గుర్తించి సాయం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో సీడబ్ల్యూసీ కమిటీలను 2 నెలల్లో పూర్తిచేస్తామని కోర్టుకు విన్నవించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 291 బాలల సంక్షేమ గృహాలుండగా, అందులో ప్రైవేటు ఆధ్వర్యంలో 231, ప్రభుత్వ ఆధ్వర్యంలో 60 నడుస్తున్నాయన్నారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా 35 సంరక్షణ కేంద్రాలున్నాయని శృతి ఓజా కోర్టుకు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 ఉన్నాయని శృతిఓజా వివరించారు. అనాథలుగా, ఎవరైనా అప్పగించడం ద్వారా దొరికిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి, ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామన్నారు. నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి దత్తతకు అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని ఆమె న్యాయస్థానానికి వివరించారు. పిల్లల సంక్షేమాన్ని శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని, కేసుల్లో దర్యాప్తును మాత్రమే తాము చేపడతామంటూ హైకోర్టుకు శిఖాగోయల్ తెలిపారు. తమ శాఖలో ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమాన్ని చూస్తామని విజయేందిర బోయి వివరించారు.

# భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు

**బినామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు**

**పలు ప్రాంతాల్లో భారీగా బినామీ ఆస్తులు**

**పక్కా ఆధారాలు సేకరిస్తున్న అధికారులు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సస్పెన్షన్‌కు గురైన డీఎస్పీ భీమ్‌రెడ్డిపై, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. అక్రమ ఆస్తులను కూడబెట్టిన కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు గతనెల 6న డీఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్ట్ అనంతరం ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో కీలకమైన ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి విధి నిర్వహణలో ఉండగా అక్రమ మార్గాల్లో దాదాపు రూ.150 కోట్ల విలువైన ఆస్తులను సంపాదించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు బినామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు కల్గి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భీమ్‌రెడ్డి సంపాదించిన ఈ భారీ ఆస్తులు కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తేల్చారు. మణికొండ, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోలు, మోమిన్‌పేట్, జహీరాబాద్, కర్ణాటకలోని బెంగళూరులోనూ ఖరీదైన ఆస్తులను గుర్తించారు. ఈ ఆస్తుల్లో సింహభాగం నేరుగా ఆయన పేరు మీద కాకుండా బినామీల పేర్లపై కొనుగోలు చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఏసీబీ దర్యాప్తులో భారీగా బినామీ ఆస్తులు బయటపడటంతో ఈ అంశంపై ఈడీ దృష్టిసారించింది. అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన మనీలాండరింగ్ ఏ విధంగా మళ్లించారనే కోణంలో ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఆస్తుల కొనుగోలు తీరు, భారీ నగదు లావాదేవీలు, ఆ నిధుల మూలాలపై పక్కా ఆధారాలను ఈడీ అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ బినామీ ప్రొహిబిషన్ యూనిట్ కూడా భీమ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఈడీ దర్యాప్తు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే భీమ్‌రెడ్డితో పాటు ఆయన బినామీలకు కూడా ఈడీ అధికారులు విచారణ నిమిత్తం నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భీంరెడ్డి నివాసముంటున్న విల్లాను 2024లో రూ.4.5 కోట్ల రిజిస్ట్రేషన్ వాల్యూతో కొనుగోలు చేసినప్పటికీ ఇంకా రిజిస్ట్రేషన్ పూర్తి చేయలేదని కొద్ది రోజుల క్రితం నిర్వహించిన సోదాల్లో ఏసీబీ గుర్తించింది. గచ్చిబౌలి జయభేరి పైన్ వ్యాలీలోని 3400 చదరపు అడుగుల క్రాంతి సియోన్ అపార్ట్?మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌ను బినామీ విష్ణువర్ధన్ రెడ్డి పేరుతో కొనుగోలు చేయించినట్లు ఏసీబీ గతంలో తెలిపింది. 2023లో పటాన్‌చెరు డీఎస్పీగా పని చేస్తున్న సమయంలో ముత్తంగిలో రెండు ఇళ్లు కొనుగోలు చేసి బినామీ ఇంద్రకరణ్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లుగా తేలింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కారు సురేశ్? అనే బినామీ పేరుతో కొనుగోలు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ గుర్తించింది. 2007లో గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని 244 గజాల ప్లాటును తన తండ్రి పేరుతో కొనుగోలు చేయించి, 2010లో గిఫ్ట్ సెటిల్‌మెంట్ ద్వారా తిరిగి తన పేరుకు మార్చుకున్నాడు. 2012లో ఓ ఇంటిని రూ.45 లక్షలకు కొని అదే స్థలంలో జీ-ప్లస్ 12తో పాటు పెంట్ హౌస్ నిర్మించి తన ఆధీనంలోనే ఉంచుకున్నాడు. ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు ఇప్పటికీ భీంరెడ్డి పేరుతోనే చెల్లిస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది.



# మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

**కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి**

**బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్**

**హైదరాబాద్,సెప్టెంబర్ 3:** తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# శంషాబాద్‌లో నకిలీ కరెన్సీ ముఠా అరెస్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** హైదరాబాద్ లో నకిలీ కరెన్సీని తయారు చేస్తున్న గ్యాంగ్స్ నిత్యం పెరిగిపోతున్నాయి. పోలీసులు, అధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టినా ఈ ఫేక్ కరెన్సీ ముఠా ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. తాజాగా శంషాబాద్ లో నకిలీ కరెన్సీ తయారు చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ముఖ్యంగా యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్ లో చూసి నకిలీ నోట్లు తయారు చేస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని తాజాగా అరెస్టు చేశారు. వీరిలో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.2.91 లక్షల విలువ జేసే నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ప్రింటర్, స్కానర్, లామినేటర్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కుటుంబం నకిలీ రూ. 500, రూ. 200, రూ. 100 నోట్లు తయారీ చేస్తున్నారని.. ఎక్కువగా రాత్రివేళల్లోనే నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మద్యం దుకాణాలు, పాన్ డబ్బాల వద్ద నకిలీ నోట్లు ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. నిందితుల్ని చింతల్ తండా, వడ్డిపట్లకు చెందిన రమావత్ రాము అలియాస్ మహ్మద్ (36), రమావత్ మోతీలాల్ (35), రమావత్ గాంధీ (19) లుగా గుర్తించారు. వీరిలో రాము ఫుడ్ డెలివరీ ఉద్యోగి కాగా మోతీలాల్ ర్యాపిడో డ్రైవర్ గా, గాంధీ ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే వీరికి సహకరించిన మరో నిందితుడు నాగోల్- బండ్లగూడకు చెందిన సుధీర్ జాన్ చెలా అలియాస్ వంశీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇక షామీర్ పేట్, బాలాపూర్ పరిధిలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్నారన్న సమాచారంతో హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ (షామీర్ పేట జోన్) పోలీసులు, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ నోట్ల తయారీ వ్యవహారం బయటపడింది. మరోవైపు నకిలీ కరెన్సీ తయారీ వెనుక మరెవరైనా ఉన్నారా..? ఈ నోట్లు ఎక్కడెక్కడ చలామణి అయ్యాయి..? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పరారీలో ఉన్న సుధీర్ జాన్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

# మందుపాతర పేలి గిరిజనుడి మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** ములుగు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో పాత మందుపాతర పేలి ఓ గిరిజనుడు ప్రాణాలు కోల్పోయాడు. వెదుల్లచెరువు కాలనీకి చెందిన మడకం నాగేశ్వరరావు (35) అనే వ్యక్తి ఈ ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే, నాగేశ్వరరావు వెదురు బొంగుల సేకరణ కోసం కర్రెగుట్టల్లోకి వెళ్లారు. ఈ క్రమంలో గతంలో మావోయిస్టులు అమర్చినట్లుగా భావిస్తున్న మందుపాతరపై ఆయన కాలు వేయడంతో అది ఒక్కసారిగా పేలింది. ఈ పేలుడు ధాటికి నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగగా, మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. గతంలో ఈ ప్రాంతం మావోయిస్టులకు కేంద్రంగా ఉండేదని, వారు అప్పట్లో అమర్చిన మందుపాతరలు ఇంకా భూమిలో ఉండే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో కూడా ఇదే ప్రాంతంలో మందుపాతరను నిర్వీర్యం చేస్తుండగా ఓ జవాన్ గాయపడిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, అటవీ ప్రాంతంలో అనుమానాస్పద వస్తువులు లేదా వైర్లు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను హెచ్చరించారు. ప్రస్తుతం కర్రెగుట్టల పరిసరాల్లో మరిన్ని మందుపాతరలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

## సంపాదకీయం



# కూతురి రాజకీయ భవితవ్యం కోసమేనా!

### కొండా కుటుంబం చుట్టూ తెలంగాణ రాజకీయం

### సుస్మిత భవిష్యత్తుపై దంపతుల కీలక ఆలోచనలు?

### బీసీ ఆత్మగౌరవ అజెండాతో కొత్త వేదికపై చర్చ

### వరంగల్ పట్టుతో స్వతంత్ర శక్తిగా ఎదిగే యోచన?

**అధికారిక ప్రకటన లేకున్నా రాజకీయ వర్గాల్లో జోరుగా ఊహాగానాలు**

తెలంగాణ రాజకీయాల్లో కొండా కుటుంబం మరోసారి చర్చకు కేంద్రబిందువైంది. మంత్రి కొండా సురేఖ చుట్టూ నెలకొన్న పరిణామాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆమె చేసిన వ్యాఖ్యలు, కుమార్తె కొండా సుస్మిత రాజకీయ భవిష్యత్తు.. ఇవన్నీ కలిపి రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తాయా? అన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా తమ కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం కొండా సురేఖ, కొండా మురళీ స్వతంత్ర రాజకీయ వేదిక వైపు అడుగులు వేస్తారా? అనే చర్చ వారి అనుచరులు, రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ దిశగా కొండా కుటుంబం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కొండా దంపతులు చాలా కాలంగా తమ కుమార్తె సుస్మిత రాజకీయ ప్రవేశంపై ఆసక్తి చూపుతున్నారన్నది వారి అనుచరుల వాదన. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలోనూ సుస్మితకు రాజకీయ అవకాశం కల్పించాలన్న ప్రయత్నాలు జరిగినట్లు చెబుతున్నారు. తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో సుస్మిత పరకాల నియోజకవర్గంపై దృష్టి పెట్టినట్లు ప్రచారం జరిగింది. అయితే పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికే మరోసారి అవకాశం ఉంటుందనే సంకేతాలు రావడంతో సుస్మిత రాజకీయ భవిష్యత్తుపై కొండా కుటుంబంలో అసంతృప్తి మొదలైందన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సుస్మిత చేసిన విమర్శలు కాంగ్రెస్‌లో కలకలం రేపాయి. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు కొండా సురేఖ రాజకీయ భవిష్యత్తుపైనా ప్రభావం చూపే స్థాయికి చేరాయన్న చర్చ జరుగుతోంది.

**కూతురి కోసం రిస్క్ చేస్తున్నారా?**

సుస్మిత వ్యాఖ్యలకు తాము బాధ్యులం కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని కొండా దంపతులు చెబుతున్నారు. అదే సమయంలో ఆమె వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించకపోవడం కూడా రాజకీయంగా చర్చకు దారితీసింది. కుమార్తె రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే కొండా దంపతులు ఈ వైఖరి తీసుకున్నారనే అభిప్రాయం వారి సన్నిహిత వర్గాల్లో వినిపిస్తోంది. దశాబ్దాల రాజకీయ అనుభవం, వరంగల్ ప్రాంతంలో ఉన్న కేడర్, ప్రజల్లో పరిచయాలు, బీసీ వర్గాల్లో తమకున్న మద్దతును ఉపయోగించుకుని సుస్మితకు ప్రత్యేక రాజకీయ వేదిక సిద్ధం చేయాలన్న ఆలోచన కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం బీసీ ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలపై సమాలోచనలు జరుగుతున్నట్లు వారి మద్దతుదారులు చెబుతున్నారు.

**బీసీ జెండాతో కొత్త పార్టీ?**

రాష్ట్రంలో బీసీ వర్గాలను ఒకే రాజకీయ వేదికపైకి తీసుకురావాలన్న ఆలోచన కొండా దంపతుల ముందున్న ప్రత్యామ్నాయాల్లో ఒకటిగా ప్రచారంలో ఉంది. ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక అసంతృప్తితో ఉన్న బీసీ నేతలను ఆకర్షించడం ద్వారా కొత్త రాజకీయ శక్తిని నిర్మించవచ్చనే లెక్కలు వేస్తున్నట్లు వారి సన్నిహిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో టికెట్లు దక్కని నేతలు, రాజకీయంగా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న వారిని ఒక వేదికపైకి తీసుకురావచ్చన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. కొత్త రాజకీయ వేదిక ఏర్పడితే నేరుగా ప్రజల్లోకి వెళ్లేందుకు రాష్ట్రవ్యాప్త పర్యటన లేదా పాదయాత్ర వంటి కార్యక్రమాలపైనా ఆలోచనలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**అంతా ప్రచారమేనా?.. అడుగు పడుతుందా?**

కొండా దంపతులకు సుదీర్ఘ రాజకీయ అనుభవం, వరంగల్ ప్రాంతంలో కేడర్ ఉన్నప్పటికీ కొత్త పార్టీ ఏర్పాటు అంత సులభమైన వ్యవహారం కాదన్న అభిప్రాయమూ రాజకీయ వర్గాల్లో ఉంది. బీసీ వర్గాలను ఒకే రాజకీయ గొడుగు కిందకు తీసుకురావడం ఎంతవరకు సాధ్యమవుతుంది? కొండా కుటుంబం వెంట ఇతర పార్టీల నేతలు ఎంతమంది నడుస్తారు? కొత్త వేదికకు రాష్ట్రవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందా? అన్న ప్రశ్నలకు ఇప్పటికైతే సమాధానం లేదు. మరోవైపు తాజా పరిణామాలన్నీ కూతురు సుస్మిత రాజకీయ భవిష్యత్తును సుస్థిరం చేసేందుకేనా? లేక కాంగ్రెస్‌లో తమ రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడుకునేందుకు కొండా దంపతులు ఒత్తిడి పెంచుతున్నారా? అన్న చర్చ కూడా సాగుతోంది. ప్రస్తుతం మాత్రం కొండా కుటుంబం తీసుకోబోయే తదుపరి నిర్ణయంపైనే అందరి చూపు నిలిచింది. కొత్త రాజకీయ పార్టీ నిజంగానే రూపుదిద్దుకుంటుందా?.. బీసీ ఆత్మగౌరవ నినాదంతో కొత్త వేదిక వస్తుందా?.. లేక కాంగ్రెస్‌లోనే రాజీ కుదురుతుందా?.. అన్నది కొండా దంపతుల అధికారిక ప్రకటనతోనే తేలనుంది.



# ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు

- అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం
- సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీలో వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3:** ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజేష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# 91 ఏళ్ల వయసు.. వరదతో ఒంటరి పోరాటం!

### రెండు గంటలకు పైగా బురద నీటిలోనే


### జేసీబీ సాయంతో సురక్షితంగా వెలికితీత

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** చుట్టూ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద.. మెడ వరకు బురద నీరు.. కదలలేని పరిస్థితి.. సాయం కోసం ఎదురుచూపులు. అయినా ఆమె ధైర్యం కోల్పోలేదు. 91 ఏళ్ల వయసులోనూ ప్రాణాలను కాపాడుకునేందుకు గంటల తరబడి పోరాడారు. నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరదల్లో గుణ మాయ బోహరా చూపిన అసాధారణ ధైర్యం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నువాకోట్‌లోని దేవీఘాట్‌లో ఉన్న 'సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫౌండేషన్' వృద్ధాశ్రమాన్ని ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. ఆశ్రమవాసులు అల్పాహారం తీసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వరద నీరు లోపలికి దూసుకొచ్చింది. ప్రమాదాన్ని గుర్తించిన పలువురు పై అంతస్తులకు పరుగులు తీశారు. మరికొందరు మాత్రం వరద ఉద్ధృతిలో చిక్కుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురు వృద్ధులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. కింది అంతస్తులోని గదిలో ఉన్న గుణ మాయ బోహరా వరదలో చిక్కుకున్నారు. కాళ్లకు సంబంధించిన సమస్యల కారణంగా వేగంగా కదలలేని పరిస్థితి ఉన్నప్పటికీ ఆమె ధైర్యం కోల్పోలేదు. గదిలోకి బురద నీరు వేగంగా చేరుతున్న సమయంలో కిటికీ తలుపులు తెరిచి, తలను నీటిపై ఉంచేందుకు ప్రయత్నిస్తూ దాదాపు రెండు నుంచి మూడు గంటలపాటు ప్రాణాలను నిలుపుకున్నట్లు సమాచారం. చివరకు స్థానిక సహాయక బృందాలు ఆమెను గుర్తించాయి. జేసీబీ సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. జేసీబీ స్కూప్‌లో కూర్చున్న గుణ మాయ చిత్రం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. వరద బీభత్సం మధ్య ఆమె చూపిన ధైర్యం, మొక్కవోని సంకల్పానికి ఆ చిత్రం ప్రతీకగా నిలుస్తోంది. అనంతరం గుణ మాయతో పాటు రక్షించిన ఇతరులను ఖాట్మండులో ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరానికి తరలించారు. అక్కడ వారికి ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు సమాచారం. నేపాల్‌లో వరదల కారణంగా భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. మృతులు, గల్లంతైన వారి సంఖ్యపై వివిధ గణాంకాలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో అధికారికంగా ధ్రువీకరించిన తాజా వివరాలే ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంది. వరదలు ఎంతటి విధ్వంసాన్ని సృష్టించినా.. 91 ఏళ్ల గుణ మాయ బోహరా సాగించిన ప్రాణపోరాటం మాత్రం విపత్తు మధ్య మనిషి సంకల్ప బలానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.



# ఆకాశ్ ఆనంద్ ఇంకా పరిణతి చెందలేదు

### బీఎస్పీ పార్టీ అధినేత్రి మాయావతి




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద బాధ్యతలు చేపట్టే స్థాయిలో ఆయన ఇంకా పరిణతి సాధించలేదని స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఆకాశ్ ఆనంద్ పార్టీని నడిపించే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ ఆనంద్ పార్టీలో కొనసాగుతారని, అయితే ప్రస్తుతం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం సరికాదని చెప్పారు. పరిస్థితులను ఆయన పరిణతితో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఆకాశ్ ఆనంద్ పార్టీలో పనిచేయడానికి నేను అనుమతించాను. అయితే ఈ విషయంలో ఆయన మరింత పరిణతి సాధించాలి. అప్పటివరకు ఆయనకు ముఖ్యమైన పార్టీ బాధ్యతలు అప్పగించడం సముచితం కాదు" అని మాయావతి పేర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడంతో పాటు ప్రజలకు మరింత చేరువ కావడంపై దృష్టి పెట్టాలని ఆమె పార్టీ నేతలకు సూచించారు. ప్రత్యర్థులు లంచాలు, బెదిరింపులు, వివక్ష వంటి మార్గాలతో బీఎస్పీని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మాయావతి వ్యాఖ్యల తర్వాత ఆకాశ్ ఆనంద్ తన 'ఎక్స్' ప్రొఫైల్‌ను కూడా మార్చారు. గతంలో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఉన్న ఆయన ఇప్పుడు తన ప్రొఫైల్‌లో 'బీఎస్పీ కార్యకర్త'గా పేర్కొన్నారు. దీంతో ఆయన మద్దతుదారుల్లో నిరాశ వ్యక్తమైంది. ఆకాశ్ ఆనంద్‌ను 2025 ఆగస్టులో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా నియమించారు. దీంతో ఆయన మాయావతి తర్వాత పార్టీలో కీలక నేతగా ఎదుగుతున్నారనే అంచనాలు ఏర్పడ్డాయి. యువతను బీఎస్పీ వైపు తీసుకురావడంతో పాటు యూపీలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారని అప్పట్లో మాయావతి ప్రకటించారు. తాజా పరిణామాలతో ఆ అంచనాలపై అనిశ్చితి నెలకొంది.

# రామ మందిర్ సీఈవో నియామకంపై రాజకీయం

### కాంగ్రెస్ అనుమానాలు..

### బీజేపీ ఘాటు ప్రత్యుత్తరం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తొలి సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణాధికారి)గా భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకంపై దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది. సైనిక అధికారికి రామ మందిర ట్రస్ట్ బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేయగా, బీజేపీ సైతం అంతే ఘాటుగా ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ సీనియర్ నేత రషీద్ అల్వీ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులకు గవర్నర్లు, రాజ్యసభ సభ్యత్వాలు కట్టబెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు రిటైర్డ్ ఎయిర్ మార్షల్‌ను టెంపుల్ ట్రస్ట్ సీఈఓగా ఎలా నియమిస్తుందని ప్రశ్నించారు. గతంలో సైనిక చర్యగా చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' వెనుక ఉన్న నిగూఢమైన రహస్యాలను దాచిపెట్టేందుకే జితేంద్ర మిశ్రాకు ఈ పదవిని రివార్డుగా ఇచ్చారా అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. మందిరంలో గతంలో జరిగినట్టు చెబుతున్న అక్రమాలు, నిధుల వ్యవహారాలపై పూర్తి విచారణ జరిపి బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయలేదని, మోదీ ప్రభుత్వ విధానాలు దేశానికి చేటు తెస్తున్నాయని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు సనాతన ధర్మంతో పాటు భారత సైనిక దళాలపై గౌరవం లేదని, దేవుడిని, సైనికులను అవమానించడమే వారి నైజమని మండిపడ్డారు. దేశం కోసం పోరాడిన సైనిక అధికారి సేవలను మందిర పారదర్శక పరిపాలన కోసం ఉపయోగించుకుంటే ఓర్వలేకపోతున్నారని బీజేపీ నాయకులు తిప్పికొట్టారు.



# కార్మికుల గోడు.. సర్కారుకు వినిపించేదెప్పుడు?

- అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి.. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు
- వెయ్యి రోజులు గడిచినా.. కార్మికుల హామీ అమలేది?
- కార్మికుల ఓట్లతో అధికారం.. హక్కులపై నిర్లక్ష్యం!



**నర్సంపేట, సెప్టెంబర్ 3 (సమయం న్యూస్) :** అసంఘటిత కార్మికులైన భవన నిర్మాణ, హమాలీ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావాలని, ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, హమాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల కోసం రాష్ట్రంలో సమగ్ర చట్టం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. కార్మికుల సంక్షేమానికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు 60 సంవత్సరాలు దాటిన తర్వాత మార్కెట్‌లో లైసెన్స్‌లను రెన్యువల్ చేయడం లేదని, కొత్త లైసెన్సులు కూడా మంజూరు చేయడం లేదని వారు ఆరోపించారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు సరైన బీమా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1996 భవన నిర్మాణ కార్మిక చట్టం ప్రకారం గతంలో కార్మికులకు లేబర్ శాఖ ద్వారా నేరుగా క్లెయిమ్‌లు అందేవని, ప్రస్తుతం బీమా వ్యవస్థను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం వల్ల అనేక కొర్రీలు పెట్టి కార్మికులకు బీమా క్లెయిమ్‌లు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. వెల్ఫేర్ బోర్డులోని నిధుల వినియోగంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. లేబర్ శాఖకు ఉన్న స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కార్మికుల హక్కులను కాపాడేందుకు సమగ్ర చట్టం తీసుకురావడంతో పాటు ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, నాయకులు మంద మల్లయ్య, కుమారస్వామి, జనార్ధన్, భవన నిర్మాణ సంఘం నాయకులు బిక్షం, రవి, కుమారస్వామి, రాజేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి బాటలో వెయ్యి అడుగులు.. కాజీపేటలో కాంగ్రెస్ సంబరాలు



- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన... జక్కుల రవీందర్ యాదవ్

**కాజీపేట, సెప్టెంబర్ 3 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1,000 రోజుల పాలనను పురస్కరించుకుని కాజీపేటలోని 47, 62, 63వ డివిజన్లలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, NSUI కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజల కోసం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న ప్రజా ప్రభుత్వమని అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ ఆరూరి సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. అంకుస్, 63వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షురాలు విజయశ్రీ, 47వ డివిజన్ అధ్యక్షుడు దొంగల కుమార్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, మాచర్ల జయకార్, మంతుర్తి బొంద్యాలు, శివరామ్, బోయిరా బోయిన అశోక్, రవికిరణ్, ప్రశాంత్, కాయిత రాజు, పోగుల రాకేష్, రెహ్మతుల్లా, గాలి శీను, సెల్వర్ శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో అల్లాడుతున్న పేదలకు.. సీఎంఆర్‌ఎఫ్ అండ



- 11 మంది లబ్ధిదారులకు రూ.6.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ డా.కడియం కావ్య

**హనుమకొండ, సెప్టెంబర్ 3 (సమయం న్యూస్) :** అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తోందని తెలిపారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.50 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీ డా.కడియం కావ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఖరీదైన చికిత్సల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందుతున్న సాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎంపీ డా. కడియం కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రారంభించనున్న ఆర్ అండ్ గెస్ట్ హౌస్





- క్రిటికల్ కేర్ ఆసుపత్రి, ల లో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి..

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,03( సమయం న్యూస్)** కొడంగల్ నియోజకవర్గం ముఖ్యమంత్రి ప్రారంభించనున్న ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. గెస్ట్ హౌస్‌లోని పూజ కార్యక్రమాలు,వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లను కలెక్ట ర్ పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పర్యటనకు సంబంధించి శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్ట ర్ సూచించారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ ను పరిశీలించి ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.ముఖ్యమంత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు.క్రిటికల్ కేర్ యూనిట్‌లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, వైద్య పరికరాలు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రోగుల సౌకర్యాలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్,ప్రోటోకాల్,డెకరేషన్,బారికేడింగ్, వైద్య సిబ్బంది, అత్యవసర వైద్య సేవలు తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.తధనంతరం ప్రాథమిక పాఠశాల (బాయ్స్ మరియు గర్ల్స్ )నందు అన్ని ఏర్పాట్లు చేయాలనీ సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు బహిరంగ సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూర్,కొడంగల్ కాడ స్పెషల్ అధికారి వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ , జడ్ పి సి ఇ ఓ సుధీర్,వసంత నాయక్, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు..

## గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్‌లో శిక్షణ, ఉపాధి అవకాశాలు :

### జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్

**ఖమ్మం, సెప్టెంబర్ 3 : ( సమయం )**తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2026–27 సంవత్సరానికి క్రిస్టియన్ మైనారిటీలకు గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్ లో శిక్షణ అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన వారై ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 2 లక్షలలోపు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, కనీస విద్యార్హతగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను కలెక్టరేట్ రెండవ అంతస్తు, ఎస్–29లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో లేదా బల్లేపల్లిలో యూనియన్ బ్యాంక్ పైన గల విన్సేల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రైనింగ్ ఇన్స్టి ట్యూట్‌లో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు సమర్పణకు ఈ నెల 10 చివరి తేదీ అని, అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు ఈ శిక్షణ, ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9704003002 మొబైల్ నంబర్ కు సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని నిరసిస్తూ.

### బీజేపీ నాయకుల (ధర్నా) నిరసన కార్యక్రమం





**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,03(సమయం న్యూస్)**
కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై చేసిన దాడిని నిరసిస్తూ, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తల ఆధ్వర్యంలో కోడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం (ధర్నా) నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఘటనను ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం కోడంగల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై జి.వి సత్యనారాయణ ను కలిసి ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లిఖితపూర్వక ఫిర్యాదు/లేఖను అందజేశారు.బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని నిరసిస్తూ ధర్నా చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాయత్రి స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు.



**వలిగొండ సెప్టెంబర్ 03 (సమయం న్యూస్)**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలోని గాయత్రి హైస్కూల్ నందు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ శ్రావణ మాసం కృష్ణ పక్షం అష్టమి రోహిణి నక్షత్ర యుక్త రోజున శ్రీకృష్ణుడు కంసుడి చెరసాలలో దేవకి, వసుదేవులకు జన్మించాడు.దీనిని గోకులాష్టమి, అని శ్రీకృష్ణుని బాల్య లీలలను స్మరిస్తూ ఉట్టి కొట్టే వేడుకను ఘనంగా నిర్వహించారని అన్నారు .ఈ కార్యక్రమంలో చైర్మన్ తవటం నరహరి, మురళీధర్ రెడ్డి, కొంతం బిక్షపతి, పాలకుర్ల వెంకటేశం గౌడ్, బిమిడి కవిత, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజ కార్యక్రమం

### గ్రామ సర్పంచ్ సీ. హెచ్ శివయ్య,మండల సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి



**యాలాల మండలం, సెప్టెంబర్,03(సమయం న్యూస్)** యాలాల్ మండల్ కేంద్రంలో దూస గంగా వెంకటేశం నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజ కార్యక్రమంలో పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలిపిన యాలాల మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ సీ. హెచ్. శివయ్య ఈ కార్యక్రమం లో 10వ వార్డ్ నెంబర్ గడ్డం బస్వారాజ్ గౌడ్, 6వ వార్డ్ నెంబర్ శేఖర్, 12వ వార్డ్ నెంబర్ ఉమేష్,గౌరవ అధ్యక్షులు రాపోల్ నాగయ్య,గ్రామ కమిటీ అధ్యక్షులు గొల్ల చందు,కార్యదర్శి హైమద్, దుద్యాల విజయ్,బుర్ణపూరి పాపయ్య,దూస శేఖర్,బుర్ణపూరి నర్సిములు,గడ్డం రాములు గౌడ్, హన్మంతు, యాదప్ప,గోరెపల్లి రాము
తమ సొంతింటి కళను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గార్లకు రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు.

## రైతు కోసం రగిలిన గుండె... మల్లా రెడ్డి పోరాటం చిరస్మరణీయం

### సీపీఎం సీనియర్ నాయకుడు సారాంపెల్లి మల్లా రెడ్డి సంస్మరణ సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** సీపీఎం సీనియర్ నాయకుడు, అఖిల భారత రైతు ఉద్యమ నాయకుడు కామ్రేడ్ సారాంపెల్లి మల్లా రెడ్డి ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. భీమారం పొద్దుటూరు గార్డెన్స్‌లో నిర్వహించిన మల్లారెడ్డి సంస్మరణ సభకు ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతులు, పేదలు, కార్మికుల హక్కుల కోసం మల్లారెడ్డి సాగించిన పోరాటాలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. ప్రజా సమస్యలపై ఆయన నిరంతరం పోరాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల్లో మల్లారెడ్డి పోషించిన పాత్ర, రైతాంగం కోసం చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## పాఠశాల విద్యలో క్రీడలకు ప్రాధాన్యం

- మండల స్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించిన
- జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వార్ల విజయకుమార్..




**కోస్గి మండలం, సెప్టెంబర్,03(సమయం న్యూస్)** విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం మానసిక ఆరోగ్యంతో పాటు చురుకుగా ఉండేందుకు ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండి క్రీడలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వార్ల విజయకుమార్ అన్నారు.గురువారం కోస్గి మండలం మీర్జాపూర్ గ్రామ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమని, గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రభుత్వం పాఠశాలలో అనేక రకాలుగా పౌష్టిక ఆహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని రెండింటిని సమానంగా తీసుకొంటూ నైపుణ్యం సంపాదించాలని విద్యార్థులకు సూచించారు. అండర్ 17 బాలుర, బాలికలు, అండర్ 14 బాల బాలికల విభాగాల్లో కలిపి మొత్తం 12 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని నిర్వహకులు తెలిపారు. మండలంలోని 12 పాఠశాలలకు చెందిన 148 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ నాయక్, మద్దూర్ ఎం ఈఓ జనార్దన్ రెడ్డి, జిల్లా ఎస్ జి ఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గిరి ప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, నర్సింహా,వెంకటేశ్వర్ రెడ్డి, పీడీ లు రాజు, రాధిక, పుష్పలత, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో మరియు ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి...

### ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నందకిషోర్,



**శంషాబాద్ సెప్టెంబర్3 :**ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నందకిషోర్ అన్నారు.గురువారం శంషాబాద్ పట్టణంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నందకిషోర్ పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు చిన్న హామీలను వెంటనే అమలు చేయాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఓలా, ఉబర్, ర్యాపిడ్, వైట్ ప్లేట్ బైకుల నిషేధించాలని ఆటో మీటర్ చార్జీల పెంపు మహాలక్ష్మి పథకం కింద 12వేల రూపాయలు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఎండి సైదుద్దీన్, ఆసిఫ్ బాయ్, ఎండి సలీం, కుమ్మరి రవి, నరసింహ గౌడ్, రాజు, ఫిరోజ్ ,గౌస్, రంజిత్ , కృష్ణా, నరసింహ, శ్రీశైలం, దర్శన్,లింగం, రమేష్,రాజు, గౌడ్, గోపాల్, నరేష్, దేవేందర్, శంకర్, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కట్టు దిట్ట మైన భద్రత మధ్య ఈవీఎంలు

- త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.



**నారాయణపేట, సెప్టెంబర్, 03 (సమయం న్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్లు కట్టు దిట్టమైన భద్రత మధ్య భద్రపరిచినట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. గురువారం త్రైమాసిక తనిఖీలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసి, అక్కడ భద్రపరిచిన యంత్రాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈవీఎంలు, వీవీప్యాట్లకు సంబంధించిన రికార్డులు, సీల్స్ పరిస్థితి, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తు, భద్రతా సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.గోదాములోని ఒక ఫైర్ సేఫ్టీ పరికరం కాలపరిమితి ముగిసినట్లు గుర్తించిన కలెక్టర్, వెంటనే దానిని మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించగా, పరికరాన్ని అధికారులు ఆ పరికరాన్ని అప్పటికప్పుడే మార్చారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, వీవీప్యాట్లను అత్యంత భద్రంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రత, నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.స్ట్రాంగ్ రూమ్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రమేష్, ఎన్నికల విభాగం అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్ శంకర్, సంబంధిత రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టు బడి ఉన్నాం

### మంత్రి పొంగులేటి



**ఖమ్మం, సెప్టెంబర్ 3 : ( సమయం న్యూస్ )** గ్రామాల సమగ్రాభివృద్ధి కి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, కూసుమంచి మండలం కేశవాపురం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండున్నర ఏళ్లలో కేశవాపురం గ్రామానికి రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇందులో రూ. 40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ. 3.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లు, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు.

పేద మహిళలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. నిరుపేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. మూడో విడత, నాల్గో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. రైతును రాజు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత రెండున్నర ఏళ్లలో రైతు రుణమాఫీ, రైతు భరోసాతో కలిపి మొత్తం రూ. 1,76,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువతకు భరోసానిస్తూ ఇప్పటి వరకు 72,000 ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 11,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద రూ. 67,000 కోట్లు విడుదల చేశామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అక్కడక్కడా ఉన్న యురియా కొరత సమస్యను ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిసివో గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, కేశవాపురం గ్రామ సర్పంచ్ బానోతు మమత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నరు.

# హామీలతో గద్దెనెక్కి.. రైతులను గాలికొదిలారు!

### కాంగ్రెస్‌విధానాలకు వ్యతిరేకంగా కాజీపేటలో బీఆర్ఎస్ రైతు సదస్సు



**కాజీపేట, సెప్టెంబర్ 3 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో గురువారం రైతు సదస్సు నిర్వహించారు. దాస్యం వినయ్‌భాస్కర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కూడాచైర్మన్ మర్రి యాదవ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మర్రి యాదవ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ, పంటల కొనుగోళ్లు, మద్దతు ధర వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని కోరారు. పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి నష్టా నికి అనుగుణంగా ఆర్థిక సాయం చేయాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలిచామని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను మరింత సమర్థంగా అమలు చేయడంతో పాటు, ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని మర్రి యాదవ్‌రెడ్డి హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరంతరం పోరాడుతారని తెలిపారు. అనంతరం కాజీపేట జంక్షన్‌లో బాకీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి .



**వలిగొండ సెప్టెంబర్ 03 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో అరూర్ గ్రామానికి చెందిన కొప్పుల శంకర్ గౌడ్ మృతి చెందిన వారి కుటుంబాని పరామర్శించి రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి 5000 రూపాయలు ఉప సర్పంచ్ గొడ్డటి సత్యం 5000 రూపాయలు గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేముల అనిల్ గుట్ట ధర్మకర్త దామర అంజయ్య శివాజీ యూనియన్ అధ్యక్షులు బత్తిని కర్ణ గౌడ్

కాంగ్రెస్ నాయకులు బండారు మైపాల్ రెడ్డి చిలకమర్రి ఉపేందర్ ఎలిమినేటి పెంటయ్య కొప్పుల దాసు ఎర్ర గుట్ట ఎర్ర శ్రీనివాస్ లోతుకుంట లక్ష్మణ్ నల్ల రాములు బత్తిని కిష్టయ్య అధ్యక్షులు ఎర్ర సాయి గౌడ్ ఉపాధ్యక్షులు పాక మహేష్ సోషల్ మీడియా బుర్ర శ్రీకర్ యాదవ్ తుదరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ప్రతిపక్ష హోదాకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**వలిగొండ సెప్టెంబర్ 03 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కెసిఆర్ తన ప్రతిపక్ష హోదాకి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వలిగొండ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్ష హోదాను కలిగి ఉండి అసెంబ్లీకి రాకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని అటువంటి వ్యక్తి తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఘోర ఓటమి భారత్‌పై పాక్ అక్కసు!

**ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో పరాజయం**

**పాక్ క్రికెట్ బోర్డుపై మాజీ ఆటగాళ్ల విమర్శలు**

**జట్టు ప్రదర్శనను సమర్థించిన మోసిన్ నఖ్వీ**

**చిన్న జట్ల చేతిలో పెద్ద జట్ల ఓటముల ప్రస్తావన**

**భారత్ ఓటమిని పరోక్షంగా గుర్తుచేశారంటున్న విశ్లేషకులు**

**ఢిల్లీ, సెప్టెంబర్ 2 :** ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర పరాజయాలు ఎదురైనా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోసిన్ నఖ్వీ తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకున్నారు. పాక్ క్రికెట్ పతనానికి బోర్డు వ్యవహారశైలే కారణమంటూ ఆ దేశ మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పిస్తున్న వేళ.. ఇటీవల చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు కూడా ఓడిపోయాయని నఖ్వీ వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. "ఇటీవల చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతమాత్రాన అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా?" అని నఖ్వీ ప్రశ్నించారు. జట్టుకు అవసరమైన ఆటగాళ్లను కచ్చితంగా ఎంపిక చేస్తామని చెప్పారు. ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించకపోతే బోర్డు మాత్రం ఏం చేయగలదని ప్రశ్నించారు. తమకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ముఖ్యమేనని పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌తో రెండు టెస్టుల్లో ఓటమిని తేలిగ్గా తీసుకోవడం లేదని నఖ్వీ స్పష్టం చేశారు. వన్డేలు, టీ20ల్లో సాధించిన పురోగతిని టెస్టుల్లోనూ కొనసాగిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. విమర్శలకు తాను ఎప్పుడూ భయపడలేదని, ఇకముందూ భయపడబోనని చెప్పారు.

### ర్యాంకింగ్స్ చూపిస్తున్న నఖ్వీ

తాను పీసీబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాకిస్థాన్ క్రికెట్ నాశనమైందంటున్న వారు గత ర్యాంకింగ్స్‌ను కూడా చూడాలని నఖ్వీ సూచించారు. వన్డేల్లో ఎనిమిదో స్థానం నుంచి ఐదో స్థానానికి, టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి జట్టు చేరిందని పేర్కొన్నారు. ఈ పురోగతిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. అయితే చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిన విషయాన్ని నఖ్వీ ప్రస్తావించడం వెనుక భారత్, దక్షిణాఫ్రికా ఇటీవల ఎదుర్కొన్న పరాజయాలను ఉద్దేశించి ఉండొచ్చని క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. పాకిస్థాన్ జట్టు వైఫల్యాలపై దృష్టి పెట్టకుండా ఇతర జట్ల ఓటములను ఉదాహరణగా చూపడం ఎంతవరకు సమంజసమన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. వరుస టెస్టు పరాజయాలతో పాక్ క్రికెట్‌పై సొంత దేశంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో నఖ్వీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరో వివాదానికి తెరతీశాయి.

# నీరజ్ స్థానంలో 24 ఏళ్ల 'బడిసె వీరుడు'!

**ఆసియా క్రీడలకు యశ్వీర్ సింగ్ ఎంపిక**

**గాయంతో మెగా టోర్నీకి నీరజ్ దూరం**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత జావెలిన్ త్రో విభాగంలో కీలక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఈ మెగా టోర్నీకి దూరం కావడంతో అతడి స్థానంలో 24 ఏళ్ల యశ్వీర్ సింగ్‌కు అవకాశం దక్కింది. ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో కాంస్య పతకంతో మెరిసిన యశ్వీర్‌ను భారత అథ్లెటిక్స్ జట్టులోకి తీసుకున్నట్లు అథ్లెటిక్స్ సమాఖ్య గురువారం వెల్లడించింది. గత కొంతకాలంగా అంతర్జాతీయ జావెలిన్ త్రోలో భారత్‌కు పతకాల పంట పండిస్తున్న నీరజ్ చోప్రా ఈసారి ఆసియా క్రీడల్లో కనిపించడు. కాలి మడమకు గాయం కారణంగా అతడు పోటీలకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో నీరజ్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం యువ జావెలిన్ త్రోయర్ యశ్వీర్ సింగ్‌ను వరించింది. యశ్వీర్ ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో 85.41 మీటర్ల దూరం ఈటెను విసిరి కాంస్య పతకం సాధించాడు. ఆ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ 24 ఏళ్ల యువ అథ్లెట్ ఇప్పుడు ఆసియా వేదికపై భారత్‌కు మరో పతకం అందించాలనే పట్టుదలతో ఉన్నాడు. జావెలిన్ త్రోలో భారత్ తరఫున యశ్వీర్‌తో పాటు రోహిత్ యాదవ్ కూడా బరిలోకి దిగనున్నాడు. ఇద్దరూ కలిసి పతక వేట సాగించనున్నారు. అయితే వారికి శ్రీలంకకు చెందిన రుమేశ్ తరంగ పతిరగేతో పాటు పాకిస్థాన్ స్టార్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. నీరజ్ చోప్రా లేని లోటును యువ అథ్లెట్లు ఎంతవరకు భర్తీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# కెప్టెన్ సంచలనం.. 5 పరుగులకే 7 వికెట్లు!

- హ్యాట్రిక్‌తో చమరి అటపట్టు విధ్వంసం
- ఇండోనేషియాపై శ్రీలంక 75 పరుగుల ఘన విజయం
- మహిళల టీ20ల్లో శ్రీలంక తరఫున తొలి హ్యాట్రిక్
- 49 పరుగులకే కుప్పకూలిన ఇండోనేషియా
- అర్ధ సెంచరీతో ఆదుకున్న నీలాక్షిక సిల్వా



**క్రీడా విభాగం:** మహిళల ఆసియా కప్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు బంతితో సంచలనం సృష్టించింది. కేవలం 5 పరుగులిచ్చి ఏకంగా 7 వికెట్లు పడగొట్టడంతో పాటు హ్యాట్రిక్ సాధించి ఇండోనేషియా బ్యాటింగ్‌ను కకావికలం చేసింది. ఫలితంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 75 పరుగుల భారీ తేడాతో ఇండోనేషియాను చిత్తు చేసింది. టాస్ గెలిచిన ఇండోనేషియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభం నుంచే ఆ జట్టు బౌలర్లు శ్రీలంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. రెండో ఓవర్లోనే ఇమేషా దులానీని పెవిలియన్‌కు పంపించారు. ఆ తర్వాత స్పిన్నర్లు వరుసగా వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక ఒక దశలో 36 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. 68 పరుగుల వద్ద ఆరో వికెట్ కూడా పడడంతో స్వల్ప స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. ఈ దశలో నీలాక్షిక సిల్వా జట్టును ఆదుకుంది. ఆరంభంలో ఎంతో ఓపికగా ఆడిన ఆమె చివరి ఓవర్లలో వేగం పెంచింది. సిక్సర్‌తో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఆమెకు ఇది మూడో అర్ధ సెంచరీ. సిల్వా 50 పరుగులతో రాణించడంతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 124 పరుగులు చేసింది.

### అటపట్టు స్పిన్‌కు విలవిల

125 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండోనేషియాకు అటపట్టు చుక్కలు చూపించింది. ఓపెనర్ పాంగెస్టుటిని ఔట్ చేసిన ఆమె ఆ తర్వాత వరుసగా వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్నువిరిచింది. పది ఓవర్లు ముగిసేసరికే ఇండోనేషియా 29 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. శ్రీలంక బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇండోనేషియా బ్యాటర్లు పరుగుల కోసం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రెండో ఓవర్ నుంచి 15వ ఓవర్ వరకు వారి బ్యాట్ నుంచి ఒక్క బౌండరీ మాత్రమే రావడం శ్రీలంక ఆధిపత్యానికి అద్దం పట్టింది.

### వరుసగా మూడు.. చరిత్రలో తొలి హ్యాట్రిక్

చివర్లో అటపట్టు మరింత చెలరేగింది. అరియాని, మాయ్‌ప్రియాని, పరమితిని వరుస బంతుల్లో ఔట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేసింది. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో శ్రీలంక తరఫున ఇదే తొలి హ్యాట్రిక్‌గా నిలిచింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అటపట్టుకు ఇదే తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కూడా కావడం విశేషం. చివరకు ఇండోనేషియా 18.3 ఓవర్లలో 49 పరుగులకే ఆలౌటైంది. అటపట్టు కేవలం 5 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టి కెరీర్ అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసింది. మహిళల టీ20ల్లో శ్రీలంక తరఫున అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా ఇది నిలిచింది. సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక 20 ఓవర్లలో 124/7 (నీలాక్షిక సిల్వా 50, సంజన కవిందీ 15; దేవి 3/23, మాయ్‌ప్రియాని 2/19). ఇండోనేషియా 18.3 ఓవర్లలో 49 ఆలౌట్ (సువాండేవి 12, పాంగెస్టుటి 10; చమరి అటపట్టు 7/5, కుమారి 1/3). శ్రీలంక 75 పరుగుల తేడాతో విజయం.

# బీసీసీఐ కీలక భేటీ.. లక్ష్మణ్‌కు అదిరే ఛాన్స్!

**టీమిండియా ప్రదర్శనపై ఉన్నతస్థాయి సమీక్ష**

**గంభీర్, గిల్, అయ్యర్‌తో బోర్డు పెద్దల చర్చలు**

**న్యూజిలాండ్ పర్యటనపై ప్రత్యేక దృష్టి**

**రోహిత్ వన్డే భవిష్యత్తుపైనా చర్చ**

**ఆసియా క్రీడలకు భారత కోచ్‌గా లక్ష్మణ్**



**ముంబై, సెప్టెంబర్ 3:** భారత క్రికెట్ జట్టు భవిష్యత్ కార్యాచరణపై బీసీసీఐ కీలక సమీక్ష నిర్వహించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ఉన్నతస్థాయి సమావేశంలో టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌తో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పాల్గొన్నారు. వ్యక్తిగత కారణాలతో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సమావేశానికి హాజరుకాలేదు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, కోశాధికారి ప్రభతేజ్ సింగ్ భాటియా, తాత్కాలిక సీఈఓ హేమాంగ్ అమీన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనతో పాటు వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లలో భారత జట్టు ప్రదర్శన, ఆటగాళ్ల ఫిట్‌నెస్, భవిష్యత్ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఆడిన ఆరు టీ20ల్లో భారత్ ఒక్క విజయమూ సాధించకపోవడంపైనా సమీక్షించినట్లు తెలుస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్‌తో జరగనున్న అన్ని ఫార్మాట్ల సిరీస్‌పైనా ప్రత్యేకంగా చర్చించారు. ఈ పర్యటనలో ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు జరగనున్నాయి. ఆటగాళ్ల పనిభారం నియంత్రణతో పాటు కీలక ఆటగాళ్లకు ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవడంపై కోచింగ్ బృందం స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం.

### రోహిత్ భవిష్యత్తుపైనా చర్చ?

సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తు కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. రోహిత్ రిటైర్మెంట్‌పై వస్తున్న ప్రచారాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇప్పటికే ఖండించినప్పటికీ.. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో ఆయన పాత్రపైనా చర్చ కొనసాగుతున్నట్లు సమాచారం.

### లక్ష్మణ్‌కు కీలక బాధ్యత

మరోవైపు వీవీఎస్ లక్ష్మణ్‌కు కీలక బాధ్యత దక్కనుంది. 2026 ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత క్రికెట్ జట్టుకు ఆయన ప్రధాన కోచ్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. లక్ష్మణ్‌తో పాటు సునీల్ జోషి, హృషికేష్ కనిట్కర్, సుభాదీప్ ఘోష్ కోచింగ్ బృందంలో ఉండనున్నారు. సమావేశం ముగిసిన అనంతరం గౌతమ్ గంభీర్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, వీవీఎస్ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# 'ఇంపాక్ట్' వద్దు.. ఆడితే ఫుల్‌గానే!

**ధోనీ ఐపీఎల్ భవిష్యత్తుపై మళ్లీ ఉత్కంఠ**

**పూర్తి స్థాయి కీపర్‌గానే ఆడాలని నిర్ణయం**

**బద్రీనాథ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ**


**ఫిట్‌నెస్‌పైనే భవిష్యత్తు ఆధారం**

**చెన్నై, సెప్టెంబర్ 3:** ఐపీఎల్‌లో మహేంద్రసింగ్ ధోనీ భవిష్యత్తుపై మరోసారి ఉత్కంఠ నెలకొంది. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కొనసాగితే పూర్తి స్థాయి వికెట్ కీపర్–బ్యాటర్‌గానే ఆడాలని ధోనీ భావిస్తున్నారని, కేవలం 'ఇంపాక్ట్ ప్లేయర్' పాత్రకు ఆయన సిద్ధంగా లేరని సీఎస్కే మాజీ బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ వెల్లడించారు. దీంతో 2027 ఐపీఎల్‌లో ధోనీ కొనసాగుతారా? లేక తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలుకుతారా? అన్న చర్చ మొదలైంది. వయసు, గతంలో ఎదురైన మోకాలి సమస్యలను దృష్టిలో పెట్టుకుంటే మ్యాచ్ మొత్తం వికెట్ కీపింగ్ చేయడం ధోనీకి సవాలుగా మారవచ్చని బద్రీనాథ్ అభిప్రాయపడ్డారు. పనిభారం తగ్గించుకునేందుకు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన ఉపయోగపడుతుందని, చివరి ఓవర్లలో బ్యాటింగ్‌కు వచ్చి ఫినిషర్‌గా సేవలందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల సీఎస్కేకు వ్యూహాత్మక ప్రయోజనం కూడా ఉంటుందన్నారు. అయితే ధోనీ మాత్రం తనను పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే భావిస్తున్నారని బద్రీనాథ్ తెలిపారు. సగం మ్యాచ్‌కే పరిమితమయ్యే ఇంపాక్ట్ ప్లేయర్ పాత్రపై ఆయన ఆసక్తి చూపడం లేదన్నారు. ఆడితే వికెట్ కీపర్--బ్యాటర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వర్తించాలన్నదే ధోనీ ఆలోచనగా పేర్కొన్నారు.

### ఫిట్‌నెస్‌పైనే అసలు నిర్ణయం

గత కొన్ని సీజన్లుగా ధోనీ మోకాలి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. 2024 సీజన్‌కు ముందు సీఎస్కే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న ఆయన.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ ఎక్కువగా చివరి ఓవర్లకే పరిమితమయ్యారు. దీంతో వయసు, ఫిట్‌నెస్, పనిభారం దృష్ట్యా రాబోయే సీజన్‌లో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించి సీఎస్కేను అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిపిన ధోనీకి అభిమానుల్లో ఉన్న క్రేజ్ ప్రత్యేకం. అయితే 'ఇంపాక్ట్ ప్లేయర్'గా కాకుండా పూర్తి స్థాయి వికెట్ కీపర్‌గానే ఆడాలన్న ఆయన వైఖరి నేపథ్యంలో 2027 ఐపీఎల్‌లో ధోనీ కనిపిస్తారా?.. లేక ఐపీఎల్ ప్రయాణానికి ముగింపు పలుకుతారా? అన్నదానికి ఆయన ఫిట్‌నెస్, తుది నిర్ణయమే సమాధానం చెప్పనుంది.





# మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి


సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్టమీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ్' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.



# 200 కోట్ల మార్క్ దాటిన 'ఆవారాపన్-2'

ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.



బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే బోల్డ్ లుక్‌లో అందాలు ఆరబోశారు. గ్లామరస్ చూపులతో యూత్ మనసు దోచేలా ఉన్న క్యూట్ ఫోటో షూట్ ట్రెండ్ అవుతోంది.



# టాక్సిక్ ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్

రాకింగ్ స్టార్ యష్ నటించిన టాక్సిక్ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద జర్నీని కొనసాగిస్తున్నది. ఈ చిత్రం కన్నడ, హిందీ భాషల్లో భారీ వసూళ్లను సాధిస్తున్నది. అయితే గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తొలుత కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ చేశారు. అయితే ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేయకుండా నిర్ణయం తీసుకొన్నారు. అయితే దాదాపు రెండో వారంలో ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేసేందుకు సిద్దమయ్యారు. భారతీయ సినిమా రంగంలో అగ్రతారలు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ నటించిన ఈ సినిమాను దక్షిణాదిలో అగ్ర సినీ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ కే నిర్మించారు. ఈ సినిమాను ఆగస్టు 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్‌ను వాయిదా వేశారు. టాక్సిక్ విషయానికి వస్తే.. ఈ సినిమాను ఒరిజినల్‌గా కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో షూట్ చేశారు. దానిని తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లోకి డబ్ చేసి విడుదల చేశారు. అయితే ఇంగ్లీష్ భాషలో రూపొందించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో రిలీజ్ వాయిదా పడిందని చిత్ర యూనిట్ వెల్లడించింది. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను సెప్టెంబర్ 4వ తేదీన రిలీజ్ చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. పరిమితమైన లోకేషన్లు అంటే.. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, తిరువనంతపురం, ఇతర ప్రాంతాల్లో రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌కు రీ సెన్సార్ చేసినట్టు తెలిసింది. వాస్తవానికి ఈ సినిమా ఇండియన్ లాంగ్వేజ్ రన్ టైమ్ విషయానికి వస్తే.. ఈ చిత్రం నిడివి 3 గంటల 14 నిమిషాలు. అంటే.. 194 నిమిషాల రన్ టైమ్‌తో రిలీజ్ చేశారు. కానీ ఇంగ్లీష్ వెర్షన్ విషయానికి వస్తే.. భారీగా కోత పెట్టారు. ఇంగ్లీష్ వెర్షన్‌లో 17 నిమిషాల సన్నివేశాలను తొలగించారు. అంటే ఫైనల్ కట్ 2 గంటల 57 నిమిషాలు అంటే.. 177 నిమిషాల రన్ టైమ్‌తో విడుదల చేస్తున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఇదిలా ఉండగా,భారతీయ భాషల్లో రిలీజైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 300 కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. ఇండియాలో 280 కోట్లకుపైగా గ్రాస్, 235 కోట్ల రూపాయల నెట్ వసూళ్లను సాధించింది. ఓవర్సీస్‌లో 42 కోట్ల రూపాయలు వసూలు చేసింది అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే.. ఇంకా భారీగా వందల కోట్లు రాబట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తువులలో అసమానతలు, నాణ్యత లోపాలు సవరించాలి

హెచ్ఎం గౌరారం గోపాల్

**బొంరస్ పేట మండలం, సెప్టెంబర్ 03(సమయం న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి లక్ష్యంగా అందిస్తున్న ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీలో ఎలాంటి అసమానతలు, నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు, మహిళా సంఘాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ అన్నారు. మొదటి విడత ఏకరూప దుస్తుల పంపిణీలో కొంతమంది విద్యార్థులకు సరైన కొలతలు లేకపోవడం, దుస్తులు బిగుతుగా లేదా వదులుగా ఉండడం వంటి సమస్యలు కనిపించాయని ఆయన తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ పథకం యొక్క అసలు ఉద్దేశం నెరవేరాలంటే ప్రతి విద్యార్థికి వారి వ్యక్తిగత కొలతలకు అనుగుణంగా నాణ్యమైన దుస్తులు అందాలని ఆయన స్పష్టం చేశారు.విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం వారి అవసరాలకు తగిన విధంగా చేరినప్పుడే దాని లక్ష్యం నెరవేరుతుంది. ఏకరూప దుస్తులు కేవలం పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, ప్రతి విద్యార్థి సౌకర్యవంతంగా ధరించేలా సరైన కొలతలు, నాణ్యతతో తయారు చేసి అందించడం అత్యంత ముఖ్యం. రెండవ జత దుస్తుల విషయంలో మొదటి విడతలో ఎదురైన లోపాలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యతలో లోపాలు తలెత్తితే సంబంధిత మహిళా సంఘాల టైలర్ల లపై పర్యవేక్షణ ఉండాలి అని హెచ్ఎం గౌరారం గోపాల్ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సంబంధిత టైలర్ టేకులగడ్డ తండా పాఠశాలను సందర్శించి విద్యార్థుల వ్యక్తిగత కొలతలను సేకరించారు. రెండవ జత ఏకరూప దుస్తుల తయారీలో ప్రతి విద్యార్థి కొలతలను ఖచ్చితంగా నమోదు చేసి, నాణ్యమైన వస్త్రంతో, సరైన కుట్టుతో దుస్తులు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వీవోఏ పాండు, టైలర్ బేగం, నందు, జెమినీభాయ్, బుజ్జిబాయి తదితరులు పాల్గొన్నారు.




# రెడ్లకో న్యాయం.. బీసీలకో న్యాయమా..?

- **కొండా సురేఖపై భర్తరఫ్ పై బీసీ పవర్ ఆగ్రహం**
- **ఒక్క మహిళపై చర్య కాదు.. బీసీ ఆత్మగౌరవంపై దాడి**
- **బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్**

**నర్సంపేట, సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో రెడ్లకు ఒక న్యాయం బీసీలకు మరో న్యాయమా? అని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ ప్రశ్నించారు. బీసీ మహిళా నాయకురాలు కొండా సురేఖపై తీసుకున్న చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తల్లిని బాధ్యురాలిని చేసి మంత్రి పదవి నుంచి తొలగించడం ఏ విధమైన న్యాయమని ప్రశ్నించారు. పార్టీలో క్రమశిక్షణ అవసరమేనని, అయితే అది అందరికీ ఒకే విధంగా వర్తించాలన్నారు. కొండా సురేఖ విషయంలో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పుడు కోమటిరెడ్డి సోదరుల విషయంలో అదే ప్రమాణాలు ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలు చేసిన సందర్భాలను ప్రస్తావిస్తూ అప్పుడు పార్టీ క్రమశిక్షణ ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. ఒకే ప్రభుత్వంలో ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయం ఉండకూడదన్నారు. కొండా సురేఖపై తీసుకున్న చర్యలు నిజంగా క్రమశిక్షణలో భాగమే అయితే అదే ప్రమాణాలను పార్టీకి చెందిన ప్రతి నాయకుడిపైనా సమానంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ వ్యవహారాన్ని బీసీ సమాజం వివక్షగా, రాజకీయ కక్షసాధింపుగా భావించే అవకాశం ఉందన్నారు. బీసీ మహిళా నాయకురాలిపై జరిగిన అన్యాయంపై బీసీ సంఘాలు, నాయకులు, ఉద్యోగ, విద్యార్థి, యువజన సంఘాలు స్పందించాలని రాజు యాదవ్ పిలుపునిచ్చారు. బీసీల జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



యాదవ సామాజిక వర్గానికి ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రివర్గ ప్రాతినిధ్యం లేకపోవడంపైనా బీసీ సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీలపై నిజమైన ప్రేమ, సామాజిక న్యాయం ఉంటే రాజకీయ ప్రాతినిధ్యం ఎందుకు తగ్గుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే నిర్ణయాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడతామని స్పష్టం చేశారు. కొండా సురేఖపై తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని, బీసీల పట్ల తన వైఖరిని స్పష్టం చేయాలని రాజు యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణలోని బీసీ సంఘాలు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి బీసీల ఆత్మగౌరవం, సమాన ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ పవర్ అధికార ప్రతినిధి మచ్చిక రాజుగౌడ్, నియోజకవర్గ నాయకులు ఆవుల నవీన్‌పటేల్, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిన్నటి నిరీక్షణకు.. నేటి అభివృద్ధి సమాధానం..!

- **శిలాఫలకాలు కాదు.. శాశ్వత అభివృద్ధి కావాలి**
- **వెయ్యి అడుగులు.. అభివృద్ధి వైపు వరంగల్ పశ్చిమ**
- **పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండున్నరేళ్లలో కళ్లముందు చూపించాం... ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**




**హనుమకొండ, సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట గురువారం ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే ప్రజల కళ్లముందు నిలబెట్టిందన్నారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు స్వయంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. వరంగల్ విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మాస్టర్‌ప్లాన్, కలెక్టరేట్, కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ అభివృద్ధి, బల్దియా పరిధిలోని ప్రధాన రహదారుల అభివృద్ధి వంటి పనులు నగర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని అన్నారు. గతంలో శిలాఫలకాలు వేసి, ప్రారంభోత్సవాలతో హడావుడి చేయడం మినహా ప్రజలకు కనిపించే స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. శిలాఫలకాల కోసం కాదు, కళ్లముందు కనిపించే అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వరంగల్ అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని నాయిని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గత పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పనులపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. గత పదేళ్లలో వరంగల్‌కు ఎన్ని నిధులు తీసుకొచ్చారు? కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో ఎన్ని నిధులు తీసుకొచ్చిందో లెక్కలు ప్రజల ముందు ఉంచితే వాస్తవాలు స్పష్టమవుతాయన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వం చేపట్టిన పనుల్లో పూర్తికాని అంశాలనే పదేపదే ప్రస్తావిస్తున్నాయని, ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను మాత్రం ప్రస్తావించడం లేదని విమర్శించారు. ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయని, వాటిని కూడా దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నీతి, నిజాయితీ, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రజల కోసం పనిచేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల సమస్యలపై నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఏం జరిగింది, నేడు ఏం జరుగుతోంది అనేది మేము చెప్పాల్సిన అవసరం లేదు. అభివృద్ధిని ప్రజల కళ్లముందే చూపిస్తున్నాం. ప్రజలే దీనికి సాక్షులు అని నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగల వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొడంగల్ లో గడిబాయి శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన

## మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,03(సమయం న్యూస్)** కొడంగల్ పట్టణ కేంద్రంలోని గడిబాయి దగ్గర ప్రాచీన శివాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, 2వ వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ లతో కలిసి శివాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, పని నిర్వాహకులు ఆదినారాయణ, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరగడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు



# నిర్బంధం నుంచి స్వేచ్ఛ వైపు.. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన

- **ప్రజలే కేంద్రంగా.. మార్పే లక్ష్యంగా...ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
- **కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై ఐనవోలులో విజయోత్సవాలు**



**ఐనవోలు, సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా ఐనవోలు మండల కేంద్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు నిర్బంధ వాతావరణంలో జీవించారని విమర్శించారు. స్వేచ్ఛాయుత పాలన కావాలనే ఆకాంక్షతోనే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. వెయ్యి రోజుల పాలనలో పోలీసుల నిర్బంధాలు, మీడియాపై ఆంక్షలకు తావులేకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుతున్నామని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సచివాలయానికి స్వేచ్ఛగా వెళ్లి తమ సమస్యలను చెప్పుకునే అవకాశం కల్పించామని అన్నారు. అన్ని రంగాల్లోని నియంతృత్వ ధోరణులకు ముగింపు పలికి.. స్వేచ్ఛాయుత వాతావరణాన్ని తీసుకొచ్చామని నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు, హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు పోలపల్లి బుచ్చిరెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు రాయపురం సాంబయ్య, సమ్మెట మహేందర్‌గౌడ్, కార్యదర్శి కట్కూరి స్వామి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోలపల్లి శివశంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహ్మద్ రఫీ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్‌గౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్కూరి సునీల్, ఆయా గ్రామాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై బీఆర్ ఎస్ సమరశంఖం

- **హామీల అమలులో కాంగ్రెస్ విఫలం..**
- **రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి,**



**శంషాబాద్ సెప్టెంబర్ 3:** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రాజేంద్రనగర్ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి అన్నారు. గురువారం నర్కూడ గ్రామంలో శంషాబాద్ మండలం మాజీ జెడ్పిటిసి బుర్కుంట సతీష్, ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. రైతులకు ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానంతో జీవించే పరిస్థితులు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందించిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా సాగితే.. కాంగ్రెస్ పాలనలో రైతులు కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, పంటలకు బోనస్, వడ్డీ లేని రుణాలు, పంటల బీమా, కౌలు రైతులకు ఆర్థిక సాయం వంటి హామీల విషయంలో ప్రభుత్వం రైతులను నిరాశపరిచిందని ఆరోపించారు. యూరియా కొరతతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆర్థిక సహాయం చేసిన తోటి స్నేహితులు.



**వలిగొండ సెప్టెంబర్ 03 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన పులి పలుకుల రాములు చిన్న కుమార్తె మహేశ్వరి భర్త బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి 2010-2011 పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థులు అండగా నిలిచారు వారి కుటుంబానికి వారి సహకారంతో 50 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు ఎరుపుల మహేష్ ఆర్రూరు రమేష్ ఇర్రీ మత్స్యగిరి గన్నెబోయిన నవీన్ పాల్గొన్నారు.

## రాజకీయ ప్రకంపనల వేళ.. గీసుకొండలో పోలీసుల నిఘా



- కొండా సురేఖ బర్త రఫ్ నేపథ్యంలో భారీ బందోబస్తు .. ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాల్లో పహారా
- గీసుగొండ సిఐ డి.విశ్వేశ్వర్

**గీసుకొండ, సెప్టెంబరు 3 (సమయం న్యూస్):** కొండా సురేఖను మంత్రి వర్గ ం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో గీసుకొండ మండలంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని సిఐ విశ్వేశ్వర్ తెలిపారు.

## కొడంగల్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ –లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### ప్రిన్సిపాల్ ఎం.డి.మాక్సుద్ అలీ



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,03(సమయం న్యూస్)** కృష్ణవేణి టాలెంట్ స్కూల్ – కొడంగల్ లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు,ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల సమక్షంలో ఎంతో ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎం.డి.మాక్సుద్ అలీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కృష్ణాష్టమి పండుగ విశిష్టతను చాటి చెప్పారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. మక్సూద్ అలీ కృష్ణాష్టమి పండుగ యొక్క ప్రాముఖ్యత, శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధనలు మరియు విద్యార్థులు నేర్చుకోవాల్సిన విలువలను వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు, కాశప్ప, రవి, కృష్ణ, హరికృష్ణ, వసంత, సునీత, రాజేశ్వరి, కవిత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు.తల్లిదండ్రుల చురుకైన భాగస్వామ్యం మరియు ఉపాధ్యాయుల సహకారంతో కృష్ణాష్టమి వేడుకలు ఎంతో ఆనందంగా మరియు విజయవంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ ఎం.డి.మాక్సుద్ అలీ తెలిపారు.

## సరిహద్దులు దాటిన స్నేహం.. సీషెల్స్ ప్రతినిధులతో రవిచంద్ర భేటీ

### ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ తో కలిసి సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**వరంగల్, సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** భారత్ పర్యటనలో ఉన్న సీషెల్స్ పార్లమెంటరీ ప్రతినిధి బృందం గురువారం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. సీషెల్స్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టా నేతృత్వంలోని ప్రతినిధి బృందం భారత పర్యటనలో భాగంగా పార్లమెంటును సందర్శించి ఉపరాష్ట్రపతితో సమావేశమైంది. ఉపరాష్ట్రపతి ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత్, సీషెల్స్ మధ్య స్నేహపూర్వక సంబంధాలు, పార్లమెంటరీ సహకారం తదితర అంశాలపై ఇరువర్గాలు చర్చించినట్లు తెలిపారు. సీషెల్స్ ప్రతినిధి బృందం గౌరవార్థం ఉపరాష్ట్రపతి తేనీటి విందు ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతినిధి బృందం సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. భారత్‌తో సీషెల్స్‌కు స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

# పదవి పోయిన బాధకంటే.. అవమానించిన తీరే కలచివేసింది

- నాకు చెప్పకుండానే బర్త రఫ్ చేశారు.!
- అధిష్ఠానం నిర్ణయంపై కొండా సురేఖ ఆవేదన..
- కుట్రతోనే మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపణ
- ఉరిశిక్షకు ముందు కూడా చివరి మాట అడుగుతారు.. నన్ను మాత్రం అడగలేదు
- నాకు జరిగిన అన్యాయం.. రేపు మీకూ జరగొచ్చు



**వరంగల్, సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అధిష్ఠానం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిందని మాజీ మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తనను రాజకీయంగా టార్గె ట్ చేసి కుట్రపూరితంగా పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె పలు అంశాలపై స్పందించారు. ఈ సందర్భంగా ఓ లేఖను విడుదల చేసి అందులో తన అభిప్రాయాలు, ఆరోపణలను పొందుపరిచినట్లు తెలిపారు. మంత్రి పదవి నుంచి తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా నాకు చెప్పలేదు. ఉరిశిక్ష అమలు చేసే సమయంలో కూడా చివరి కోరిక ఏమిటో అడుగుతారు. కానీ నాకు ఆ అవకాశం కూడా ఇవ్వలేదని సురేఖ వ్యాఖ్యానించారు. తనను తొలగించడంలో తిరుపతిరెడ్డి తదితరుల కుట్ర ఉందని ఆమె ఆరోపించారు. తన కుమార్తెకు సంబంధించిన వ్యవహారాన్ని కూడా రాజకీయంగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. సుమంత్ వ్యవహారంలో తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కావాలనే బద్నాం చేశారని ఆరోపించారు. సుమంత్ కేసును సీసీఎస్‌కు బదిలీ చేసి టార్గె ట్ చేసి వేధిస్తున్నారని పేర్కొన్నారు. నేను మంత్రిగా ఉన్న సమయంలోనే ప్రభుత్వంలో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం బాధాకరమని అన్నారు. తనపై చర్యలు తీసుకున్న విషయంలో పార్టీ నాయకత్వం అనుసరించిన ప్రమాణాలపై కూడా ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. మల్లు రవి, ఇతర నాయకులు గతంలో పార్టీపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ వారికి ఒక న్యాయం, తనకు మరో న్యాయం ఎందుకని ప్రశ్నించారు. గతంలో పలువురు నాయకులు పార్టీ, అధిష్ఠానంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లో ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. నా కూతురు చేసిన వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేసి పదవి నుంచి తొలగిస్తారా? నాకు జరిగినదే రేపు మీకూ జరగొచ్చు అంటూ పార్టీ నేతలకు సురేఖ సూచించారు. ప్రభుత్వంలో జరుగుతున్న వ్యవహారాలపై ఇబ్బంది పడుతున్న నాయకులు మౌనం వీడి గళం విప్పాలని పిలుపునిచ్చారు. తన పదవి తొలగించడం వేరే విషయమని, అయితే కనీసం ముందుగా తనకు సమాచారం ఇవ్వాల్సిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఒక బీసీ మహిళా మంత్రిని ఎలా పదవి నుంచి తొలగించారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని సూచించారు. పార్టీలో ఏకపక్ష నిర్ణయాలు, మోనోపోలీ ధోరణి సరికాదన్నారు. ముఖ్యమంత్రి భవిష్యత్‌పై ఏకపక్షంగా ప్రకటనలు చేయడం, ఎమ్మెల్యే అభ్యర్థులను ముందుగానే ప్రకటించడం వంటి అంశాలపైనా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి రాజకీయాల్లోకి వచ్చాం.. ప్రజలకే మేం జవాబుదారీ అని కొండా సురేఖ అన్నారు. తనకు జరిగిన పరిణామాలపై ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఆమె విడుదల చేసిన లేఖలో తనపై జరిగిన పరిణామాలు, పార్టీ వ్యవహారశైలి, తన కుటుంబానికి సంబంధించిన అంశాలతో పాటు పలు రాజకీయ విషయాలను ప్రస్తావించినట్లు తెలిపారు.

# పేదింట వెలుగై.. రైతుకు భరోసాగా.. వెయ్యి రోజుల ప్రజాపాలన







- కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం.. సంక్షేమ పథకాలే ఆయుధాలు
- ప్రతీ కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- పరకాలకు పూర్వ వైభవం తీసుకొస్తా... ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

**పరకాల, సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా పరకాల పట్టణంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ, డీసీసీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగిన ర్యాలీని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కుంకుమేశ్వర దేవస్థానం, వెల్లంపల్లి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, హుజూరాబాద్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, సంక్షేమ పథకాలే తమ ప్రధాన ఆయుధాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సన్నబియ్యం పంపిణీ, 15.46 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. విద్యార్థుల డైట్ చార్జీలు పెంచామని, అర్హులైన వారికి పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. చారిత్రక పరకాల పట్టణానికి పూర్వ వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రత్యేక డీపీఆర్ ద్వారా పట్టణంలో మంచినీటి సరఫరా, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. పరకాలను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, టాస్క్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని ఎమ్మెల్యే విమర్శించారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాలనపైనా రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శలు చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి, ప్రభుత్వ నిధులతో రోడ్లు వేయించి వాటి విలువ పెంచుకుని విక్రయించారంటూ ఆరోపణలు చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో 06 గ్యారంటీలు ఆగం

### పైళ్ల శేఖర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే.



**వలిగొండ సెప్టెంబర్ 03 (నిఘా న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 1000 రోజులు పూర్తి అయినా కానీ ఎలాంటి సంక్షేమ పథకాలుప్రజలకు అమలు చేయలేదు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు జరిగే నిరసన కార్యక్రమంలో రెండవ రోజైన గురువారం వలిగొండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల నిరసన కార్యక్రమానికి పైళ్ళ శేఖర్ రెడ్డి భువనగిరి మాజీ శాసనసభ్యులు,కంచర్ల రామకృష్ణారెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మా ప్రభుత్వ హయాంలో వలిగొండ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు కోసం 13 కోట్ల రూపాయలు మంజూరు చేశామని,అయినా రోడ్డు పనులు జరగడం లేదన్నారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తన సొంత గ్రామంలో అభివృద్ధి చేయకపోతే నియోజవర్గంలో ఏమి అభివృద్ధి చేస్తాడని ఎద్దేవా చేశారు.భువనగిరి నియోజకవర్గంలో యే గ్రామానికి వెళ్లి చూసినా నేను చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నాయి.కానీ మీరు చేసిన పనులేందో చెప్పాలని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డికి సవాల్ విసిరారు.కెసిఆర్ పాలనలో రైతులకు రైతుబంధు,రైతు బీమా,24గంటల ఉచిత కరెంటు, సకాలంలో ఎరువులు, గ్రామాలలోనే వడ్లు కొనుగోలు కేంద్రాలు,తదితర అన్ని సంక్షేమ పథకాలు అమలయ్యి,రైతులు కెసిఆర్ 10 ఏళ్ల పాలనలో రైతుల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు,రైతు భీమా,వడ్లకు 500 బోనస్ ఎగ్గొ ట్టారు,రుణమాఫీ అందరికి అమలు కాలేదు.కరెంటు ఇచ్చే 12 గంటలలో 10 సార్ల కరెంటు పోయి రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులను పట్టించుకోవడం లేదు.కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంలో నీళ్లు ఉన్నా,ఇవ్వలేక కరువు తెచ్చారు.రైతులను హరి గోసలు పెడుతున్నారు.తక్షణమే రైతులకు రావాల్సిన సంక్షేమ పథకాలు, నాణ్యమైన 24 గంటల కరెంటు సప్లై కుంభం అనిల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎలిమినేటి సందీప్ రెడ్డి మాజీ జడ్పీ చైర్మన్,చింతల వెంకటేశ్వర రెడ్డి రాష్ట్ర నాయకులు, పైళ్ల రాజా వర్ధన్ రెడ్డి, వంగాల వెంకన్న గౌడ్,మొగుళ్ళ శ్రీనివాస్ వలిగొండ మాజీ జెడ్పిటిసి, సురకంటి వెంకట్ రెడ్డి సింగిల్విండో మాజీ చైర్మన్, ముద్దసాని కిరణ్ కుమార్ రెడ్డి మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, వలిగొండ మాజీ ఎంపీటీసీ పల్సం రమేష్, మాజీ మండల అధ్యక్షుడు దేగల పాండు,పట్టణ అధ్యక్షుడు ఎండి అప్రోజ్, ఉద్యమకారుడు పోలేపాక సత్యనారాయణ, సర్పంచ్ బుడిగే లింగస్వామి, మోటే జంగమ్మ లింగస్వామి, మాజీ సర్పంచ్ బొడ్డుపల్లి కృష్ణ వార్డ్ నెంబర్ బలుగూరి నరేష్ రెడ్డి , మాడుగుల స్వర్ణలత, మండల సోషల్ మీడియా అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్ ,నాయకులు పల్సం రాజు, ఐటీపాముల ప్రభాకర్, కూచిమల్ల నాగేష్ ,కాశమల్ల శేఖర్, కలుకూరి రాములు పోలేపల్లి రమేష్ గాజుల అంజయ్య నీలం నరేందర్ కోమటిరెడ్డి చంద్రారెడ్డి సంగిశెట్టి చంద్రయ్య మల్లం నరేష్ ,కూచిమల్ల భగవంతు, కొండూరు వెంకటేశం, సాంబ, చేవ్వ వెంకటేశం, సర్పంచులు మాజీ సర్పంచ్లు మాజీ ఎంపిటిసిలు మాజీ వార్డ్ నెంబర్లు వార్డ్ నెంబర్లు రైతులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో

# ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు..

**జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**



**మద్దూరు మండలం, సెప్టెంబర్,03(సమయం న్యూస్)**

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేడు (శుక్రవారం) నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా గురువారం సాయంత్రం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ముఖ్యమంత్రి పర్యటించే హెలిప్యాడ్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అక్కడి నుంచి హనుమాన్ ఆలయం మీదుగా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల వరకు ఉన్న మార్గంలో రహదారులు, పారిశుద్ధ్యం, బ్యారికేడింగ్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, భద్రతా ఏర్పాట్లను సంబంధిత శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.హెలిప్యాడ్ నుంచి డిగ్రీ కళాశాల వరకు రహదారి పరిస్థితిని పూర్తిగా పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతులు, ఫిల్లింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల వెంట ఎలాంటి ఓపెనింగ్స్ లేకుండా బ్యారికేడింగ్‌ను పటిష్టంగా ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా రోడ్డు ప్రారంభ ప్రాంతాలు, కీలక కూడళ్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసు, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు.మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ సిబ్బంది తమ పరిధిలోని మార్గాల్లో పారిశుద్ధ్య పనులు, చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రత పనులను పూర్తిచేయాలని తెలిపారు. అవసరమైతే రాత్రి వేళల్లోనూ పనులు కొనసాగించి, ఉదయం నాటికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున జన సమూహాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, బ్యారికేడింగ్, యాక్సెస్ కంట్రోల్, భద్రతా చర్యలను ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాలకే పరిమితం కాకుండా మొత్తం పర్యటన మార్గాన్ని సమన్వయంతో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాల/కళాశాల తదితర ముఖ్య ప్రాంతాలకు పాయింట్ అధికారులను నియమించి, ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేలా బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ సూచించారు.అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, సమీపంలోని ఆసుపత్రులు, వైద్య సదుపాయాలను గుర్తించి అవసరమైన సమయంలో వినియోగించుకునేలా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన తాగునీరు, ఆహారం తదితర సదుపాయాలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని, ఆహార నాణ్యతను పరిశీలించేందుకు సివిల్ సప్లైస్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, తమకు అప్పగించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు.

**సీఎం పర్యటనలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టా లి .జిల్లా ఎస్పీ డాక్ట ర్ వినీత్ ఐపీఎస్.**

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలు, పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, ఇతర సందర్శకులు అనవసరంగా ముఖ్యమంత్రి వాహనం సమీపానికి రాకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. ముఖ్యమంత్రి వాహనం రాకపోకలు సాగించే ప్రాంతాల్లో సెక్యూరిటీ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, యాక్సెస్ కంట్రోల్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వాహనం రాక, వెళ్లే సమయంలో ప్రజలు ఒక్కసారిగా వాహనం సమీపానికి వచ్చే ప్రయత్నం చేయకుండా తగిన సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరించాలని సూచించారు.వాహనాల రాకపోకల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు.ముఖ్యమంత్రి ఎక్కువ సమయం గడిపే ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి తదుపరి ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లోనూ భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు తదితరులకు కేటాయించిన ప్రాంతాలు, ప్రవేశ మార్గాలను ముందుగానే నిర్దేశించి, అనుమతి లేని వ్యక్తులు భద్రతా పరిధిలోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు.

**పర్యటన ప్రాంతాల్లో పరిశీలన**

అంతకుముందు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఇంటెలిజెన్స్ భద్రతా విభాగం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రియాంక మద్దూరు పట్టణ సమీపంలోని హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి శుక్రవారం పరిశీలించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ స్థలాన్ని, చింతల్ దిన్నె మార్గంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సమావేశంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డీఆర్వో రాజేశ్వరి, అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేశ్,ఆర్అండ్‌బీ,ఈడబ్ల్యూఐడీసీ, ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఫీజుల కోసం ఎదురుచూపులు..

- **ఉద్యోగాల కోసం నిరీక్షణ..**
- **హామీలు కాదు.. మోసాలే మిగిలాయి!**
- **ఫీజు రీయింబర్స్ మెంట్ , స్కాలర్ షిప్ లు వెంటనే చెల్లి ంచాలి.. 5న బీఆర్ఎస్ భారీ ర్యాలీ... దాస్యం వినయ్ భాస్కర్**



**హనుమకొండ, సెప్టెంబరు 3 (సమయం న్యూస్):** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యువజన విభాగాల ఆధ్వర్యంలో ఏకశిల పార్కు నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అధ్యక్షతన నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి అంశాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రతి విద్యార్థినికి ఉచిత స్కూటీ ఇస్తామన్న హామీని కూడా ప్రభుత్వం మరిచిపోయిందని ఆరోపించారు. “కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు హామీలు కాదు.. మోసాలే మిగిలాయి” అని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే హామీలను అమలు చేసి విద్యార్థులు, యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల మాజీ కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయభాస్కర్, జోరిక రమేష్, సోదా కిరణ్, నర్సింగ్, బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, జిల్లా కోఆర్డినేటర్లు లంక రాజగోపాల్, గం ద్రకోట రాకేష్‌యాదవ్, బీఆర్ఎస్వీ నాయకులు కలకోట్ల సుమన్, కందికొండ తిరుపతి, రాసూరి, స్నేహితు సిద్దు, ఇస్మాయిల్, భార్గవ్, బీఆర్ఎస్ యువజన నాయకులు రామ్మూర్తి, కేసోజు ప్రణయ్, మహమూద్, వినీల్‌రావు, సృజన, సందీప్, ఉదిత్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు





**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్**

**మద్దూరు మున్సిపల్, సెప్టెంబర్,03(సమయం న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేడు( శుక్రవారం) రోజు నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల మరియు గురుకుల కళాశాల/పాఠశాల భవనాల నిర్మాణ పనులను పరిశీలించడం కోసం రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.మద్దూర్ లోని ఒక ఫంక్షన్ హాల్‌లో ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు విధుల్లో పాల్గొనడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...నారాయణపేట జిల్లా పోలీసులతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుండి వచ్చిన పోలీసు బలగాలతో కలిపి మొత్తం 500 మంది పోలీసులను బందోబస్తు విధుల్లో నియమించినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను మొత్తం 09 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ లను ఇన్‌చార్జీలుగా నియమించినట్లు తెలిపారు. భద్రతా విధుల్లో ఉన్న అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు.హెలిప్యాడ్ నుండి కాన్వాయ్ రోడ్డు మార్గానికి రోడ్ ఓపెనింగ్ పార్టీలు, పెట్రోలింగ్ టీములు, ట్రాఫిక్ డైవర్షన్ సిబ్బంది, రూఫ్‌టాప్ సెంట్రీలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు, పార్కింగ్ నిర్వహణ సిబ్బందిని మోహరించినట్లు ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని విధుల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని ప్రతి పోలీసు అధికారి మరియు సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి అప్రమత్తతతో నిర్వర్తించాలని ఆదేశించారు. భద్రతా లోపాలు తలెత్తకుండా రూట్ మానిటరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు మహేష్, లింగయ్య, సీఐలు, ఎస్సైలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల కన్నీళ్లు తుడిచే సంక్షేమ హస్తం..

- **ప్రభుత్వ సాయం ఇక సులభం..స్మార్ట్ రేషన్ కార్డులతో భరోసా...**
- **లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వర్ధన్నపేట, సెప్టెంబరు 3 (సమయం న్యూస్):** పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా, సులభంగా అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేటలోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని అన్నారు. రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం తదితర పథకాల ద్వారా పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం వర్ధన్నపేట కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి-రాజేందర్, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి మోకుదెబ్బ రమేష్ గౌడ్ పరామర్శ

**కమలమ్మ గౌడ్ దశదిన ఖర్మ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి నివాళులు**



**దుగ్గొండి/వరంగల్, సెప్టెంబరు 3 (సమయం న్యూస్):** దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకుడు అనగోని తిరుపతి గౌడ్ మాతృమూర్తి కమలమ్మ గౌడ్ దశదిన ఖర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) నాయకుడు మోకుదెబ్బ రమేష్‌గౌడ్ హాజరై కమలమ్మ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాతృమూర్తిని కోల్పోవడం తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ దుగ్గొండి మండల అధ్యక్షుడు తడుక కొమురయ్య గౌడ్, జిల్లా నాయకులు మచ్చిక రాజుకుమార్ గౌడ్, జనగాం రమేష్ గౌడ్, బీరం సంజీవరెడ్డి, దూపటి ఆనంద్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ జల్గం రమేష్, మహేందర్, తాళ్లపెల్లి చంద్ర మౌళి గౌడ్, జూలూరి సత్యేందర్ గౌడ్, సొల్తి మధు గౌడ్, దుడెల రాజేష్ గౌడ్, వల్లాల శేఖర్ గౌడ్, దూలం చంద్రమౌళి గౌడ్, దూలం తిరుమల్ గౌడ్, సమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మానికి దిక్సూచి.. ప్రేమకు ప్రతిరూపం శ్రీకృష్ణుడు

- **శ్రీకృష్ణుడి కృపతో ప్రతీ ఇంటా ఆనందం వెల్లి విరియాలి**
- **శ్రీకృష్ణ జన్మాష్ట మి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**వరంగల్, సెప్టెంబరు 3 (సమయం న్యూస్) :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ పరమాత్మ భూమిపై అవతరించిన పవిత్రమైన రోజును జన్మాష్టమి, కృష్ణాష్టమిగా జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. హిందువుల ముఖ్యమైన పండుగల్లో జన్మాష్టమి ఒకటని తెలిపారు. ఈ పర్వదినం సందర్భంగా భక్తులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భగవద్గీత, శ్రీమద్భాగవతం పారాయణం చేస్తారని చెప్పారు. పలు ప్రాంతాల్లో ఉట్లు కొట్టడం వంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందిస్తారని, పాఠశాలల్లోనూ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. జన్మాష్టమి మనకు ధర్మం, భక్తి, ప్రేమ, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను గుర్తు చేస్తుందని ఎంపీ రవిచంద్ర అన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జన్మాష్టమిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. శ్రీకృష్ణుడి కృపతో తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# జీర్ణోద్ధరణ అంటే.. చరిత్రను చెరపడం కాదు!

## రాళ్ల మార్పు కాదు.. క్షేత్ర జీవనాడుల పరిరక్షణ

**ధర్మపురి నారసింహ క్షేత్ర పునరుద్ధరణలో అడుగడుగునా అప్రమత్తత అవసరం**

**ఆగమం.. వాస్తు.. శిల్పం.. పురావస్తు నిపుణుల సమన్వయమే కీలకం**

**పురాతన శాసనాలు, శిల్పాలు, దిక్పాలకుల ఆనవాళ్లను పదిలపరచాలి**

**శిల్పం నిలిస్తేనే చరిత్ర.. సంప్రదాయం బతికితేనే క్షేత్రం**



భారతీయ సంస్కృతీ స్రవంతిలో దేవాలయం అంటే కేవలం ఇటుకలు, రాళ్లతో నిర్మించిన కట్టడం కాదు. మంత్ర, తంత్ర, యంత్ర శాస్త్రాల సమన్వయ స్వరూపం. ఆధ్యాత్మిక చైతన్య కేంద్రం. శిల్పం, వాస్తు, ఆగమం, ఆరాధనా సంప్రదాయాలు, సామాజిక జీవన విలువలు కలగలిసిన సజీవ వారసత్వం. "దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవస్సనాతనః" అన్న ఆర్యోక్తి ప్రకారం ఆలయం భగవంతుని స్థూల శరీరమైతే.. గర్భగుడి దాని హృదయం. ప్రాకారాలు ప్రాణకోశాలు. మండపాలు, విమానం, పరివార దేవతల స్థానాలు అన్నీ ఒక నిర్దిష్టమైన ఆగమ, వాస్తు క్రమంలో అంతర్భాగాలు. అందుకే ప్రాచీన ఆలయానికి జీర్ణోద్ధరణ చేపట్టడమంటే పాత గోడలను కూల్చి ఆధునిక హంగులతో కొత్త నిర్మాణాలు చేపట్టడం కాదు. తరతరాలుగా సంక్రమించిన శిల్ప సౌందర్యం, ఆగమ ప్రామాణికత, ఆరాధనా సంప్రదాయం, చారిత్రక ఆనవాళ్లను చెక్కుచెదరకుండా కాపాడుతూ.. అత్యవసరమైన చోట మాత్రమే శాస్త్రబద్ధంగా మరమ్మతులు చేయడం. ఈ వివేకం లోపిస్తే ఎంత ధనం వెచ్చించినా ప్రయోజనం ఉండదు. ఆలయం కొత్తగా మెరిసిపోవచ్చు.. కానీ దాని చరిత్ర కనుమరుగవుతుంది. క్షేత్రం మిగులుతుంది.. కానీ దాని ఆత్మను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

### ధర్మపురి.. చరిత్రకు సజీవ సాక్ష్యం

పుణ్య గోదావరి దక్షిణవాహినిగా ప్రవహించే తీరాన వెలసిన ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ క్షేత్రాన్ని ఈ కోణంలోనే చూడాలి. వివిధ రాజవంశాల కాలానికి చెందిన చారిత్రక ఆనవాళ్లు, వేద విద్యా సంప్రదాయాలు, లలిత కళలు, హరి--హర ఆరాధనా సమన్వయంతో ధర్మపురికి ప్రత్యేక స్థానం ఉంది. క్షేత్ర మహాత్మ్య సాహిత్యం, శాసనాలు, స్థానిక వాఙ్మయ సంప్రదాయం ఈ ప్రాంతపు సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రయాణానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇక్కడి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రత్యేక పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యం ఉంది. స్వామివారి ఆరాధనతో ముడిపడిన సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఆలయం చుట్టూ అష్టదిక్కుల్లో క్షేత్రరక్షకులుగా హనుమంతుని విగ్రహాలు ఉండటం కూడా ఇక్కడి ఆగమ, వాస్తు సంప్రదాయంలో విశిష్ట అంశంగా భావిస్తారు. వీటిని కేవలం శిల్పాలుగా కాకుండా క్షేత్ర నిర్మాణ వ్యవస్థలో భాగంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### రెండు ఆలయాలు.. ఒకే చరిత్రగా చూడొద్దు

ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సిన అంశం యోగానంద నరసింహ ఆలయం, ఉగ్ర నరసింహ ఆలయాల చారిత్రక నేపథ్యం. ప్రధాన యోగానంద నరసింహ ఆలయానికి అత్యంత ప్రాచీనమైన ఆరాధనా సంప్రదాయం ఉందని క్షేత్ర వాఙ్మయం పేర్కొంటోంది. ఉగ్ర నరసింహ ఆలయాన్ని స్థానిక దాత పనతుల నారాయణ దీక్షితులు నిర్మించినట్లు స్థానిక చారిత్రక వివరాలు చెబుతున్నాయి. అందువల్ల ఉగ్ర నరసింహ ఆలయ పునర్నిర్మాణ ప్రణాళిక రూపొందించేటప్పుడు ప్రధాన యోగానంద నరసింహ ఆలయ చారిత్రక పరిధి, అనుబంధ ఆలయ ప్రత్యేకతలను కలగాపులగం చేయకూడదు. ఏ నిర్మాణం ఏ కాలానికి చెందినది? దాని అసలు స్వరూపం ఏమిటి? ఏ ఆరాధనా సంప్రదాయంతో ముడిపడి ఉంది? అనే అంశాలను శాస్త్రీయంగా నిర్ధారించిన తర్వాతే పనులు చేపట్టాలి.

### ఇంజినీరింగ్ ఒక్కటే సరిపోదు

ప్రాచీన దేవాలయ జీర్ణోద్ధరణ సాధారణ భవన నిర్మాణం కాదు. ఆగమాలు, శిల్పశాస్త్రం, వాస్తు సంప్రదాయాల్లో విమానం, ప్రాకారం, మండపం, గర్భగృహం వంటి నిర్మాణాలకు నిర్దిష్ట ప్రమాణాలున్నాయి. ధర్మపురిలోనూ విభిన్న వైదిక, ఆగమ, ఆరాధనా సంప్రదాయాలు కాలక్రమంలో కలగలిసి సజీవంగా కొనసాగుతున్నాయి. అందువల్ల కేవలం భవన నిర్మాణ ఇంజినీర్లు రూపొందించిన నమూనాతో ముందుకు వెళ్లడం సరికాదు. ఆగమ పండితులు, సంప్రదాయ ప్రధానార్చకులు, స్థపతులు, పురావస్తు నిపుణులు, వారసత్వ నిర్మాణాల సంరక్షణలో అనుభవమున్న స్ట్రక్చరల్ ఇంజినీర్లు కలిసి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి. ముందుగా ప్రతి నిర్మాణ భాగాన్నీ శాస్త్రీయంగా నమోదు చేయాలి. ఏ రాయి పటిష్ఠంగా ఉంది? ఏది దెబ్బతింది? ఏ శిల్పానికి పరిరక్షణ అవసరం? అన్నది నిర్ధారించిన తర్వాతే జోక్యం చేసుకోవాలి. పటిష్టంగా ఉన్న పురాతన రాతిని కేవలం కొత్తదనం కోసం తొలగించడం జీర్ణోద్ధరణ కాదు.. వారసత్వ నష్టం. శతాబ్దాల నాటి శాసనాలు, స్తంభాలు, ద్వారశాఖలు, సూక్ష్మ శిల్పాలు, పాత రాతి నిర్మాణాలను యథాతథంగా పరిరక్షించాలి. వాటిపై విచక్షణారహితంగా రంగులు వేయడం, సిమెంటు పూతలు పూయడం, ఆధునిక టైల్స్‌తో కప్పేయడం వంటి చర్యలు పురాతన స్వరూపాన్ని శాశ్వతంగా దెబ్బతీయవచ్చు. జీర్ణోద్ధరణలో మొదటి సూత్రం 'కొత్తగా కనిపించాలి' అన్నది కాదు.. 'పాతది పదిలంగా ఉండాలి' అన్నదే కావాలి. ఉగ్ర నరసింహ ఆలయ పరిసరాల్లో గతంలో ఉన్నట్లు చెబుతున్న అష్టదిక్పాలకుల పీఠాలకు సంబంధించిన అంశాన్ని కూడా లోతుగా పరిశోధించాలి. ప్రస్తుతం అగ్ని, కుబేర, ఇంద్ర విగ్రహాలు మాత్రమే లభ్యమవుతున్నట్లయితే.. మిగిలిన దిక్పాలక విగ్రహాలు ఎక్కడ ఉండేవి? ఎప్పుడు అదృశ్యమయ్యాయి? పాత నిర్మాణ మార్పుల్లో తొలగించబడ్డాయా? మరెక్కడైనా భద్రపరిచారా? అన్నది తేల్చాలి. దీనికోసం పాత ఛాయాచిత్రాలు, దేవస్థాన రికార్డులు, శాసనాలు, స్థల నమూనాలు, స్థానిక అర్చక కుటుంబాల మౌఖిక చరిత్రను పరిశీలించాలి. సరైన ఆధారాలు లభించకుండానే కొత్త విగ్రహాలను తయారు చేసి పాతవాటి స్థానంలో ప్రతిష్ఠించడం కంటే ముందు ఆగమ, పురావస్తు నిపుణుల అభిప్రాయం తీసుకోవడం అత్యవసరం. అదేవిధంగా ఆలయ తూర్పు దిశలో వెలుపల ఉన్న గణపతి విగ్రహాన్ని తరలించే విషయంలోనూ తొందరపాటు పనికిరాదు. క్షేత్ర ప్రవేశ వాస్తులో ఆ విగ్రహ స్థానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందా? ద్వార విఘ్నేశ్వరుడిగా లేదా క్షేత్ర సంరక్షకుడిగా ప్రతిష్ఠించారా? అనే అంశాలను పాత క్షేత్ర నమూనాలు, ఆగమ సంప్రదాయం ఆధారంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. జీర్ణోద్ధరణలో అన్నింటికంటే ముఖ్యమైనది గర్భగుడిలోని మూలవిరాట్టు భద్రత. భారీ యంత్రాల కంపనాలు, నిర్మాణ దుమ్ము, రసాయనాలు, సున్నం తదితరాల ప్రభావం మూలమూర్తిపై పడకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే సంబంధిత ఆగమ సంప్రదాయం ప్రకారం బాలాలయం ఏర్పాటు, కలశ స్థాపన, అంకురార్పణ, మృత్సంగ్రహణం, హోమాది క్రతువులు నిర్వహించాలి. నిర్మాణ పనులు పూర్తయ్యాక సంబంధిత సంప్రదాయం ప్రకారం అష్టబంధన, మహాకుంభాభిషేకం, సంప్రోక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. అదే సమయంలో నిత్య పూజలు, తీర్థప్రసాదాల వితరణ, ఉత్సవాలు, స్వామివారి ప్రదక్షిణ, సంచార మార్గాలకు ఆటంకం కలగకుండా పనులను దశలవారీగా చేపట్టాలి. నేడు అనేక పుణ్యక్షేత్రాల్లో ఆధునికీకరణ పేరుతో మార్బుల్, గ్రానైట్, మెరిసే టైల్స్, అద్దాలు, ఇతర అలంకరణలను విచక్షణారహితంగా ఉపయోగించడం వల్ల పాత ఆలయాల సహజ స్వరూపం మారిపోతోంది. ధర్మపురిలో అలాంటి పొరపాటుకు తావివ్వరాదు. గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, విమానం వంటి కీలక నిర్మాణాల్లో అసలు నిర్మాణ పదార్థం, శైలి, కాల స్వభావాన్ని గుర్తించి దానికి అనుగుణమైన పరిరక్షణ పద్ధతులనే అనుసరించాలి. డ్రైనేజీ, విద్యుత్ తీగలు, వర్షపు నీటి నిర్వహణ, భక్తుల క్యూలైన్లు, అగ్నిమాపక భద్రత వంటి ఆధునిక సదుపాయాలు అవసరమే. కానీ అవి ఆలయ సంప్రదాయ రూపాన్ని కప్పివేయకుండా, వీలైనంత వరకు కనబడని విధంగా అమర్చాలి. పురావస్తు, వారసత్వ సంపద పరిరక్షణకు వర్తించే చట్టాలు, నిబంధనలు, నిపుణుల సూచనలను పాటిస్తూ ప్రతి అడుగు వేయాలి. ఎందుకంటే ఆలయంలో తొలగించే ప్రతి పురాతన రాయి ఒక చరిత్రపుట కావచ్చు. ప్రతి శాసనం గతానికి సాక్ష్యం కావచ్చు. ప్రతి శిల్పం భావితరాలకు అందించాల్సిన సంస్కృతీ సంపద కావచ్చు.

### ఇది కాంట్రాక్టు కాదు.. పరిరక్షణ యజ్ఞం

ధర్మపురి ఉగ్ర నరసింహ ఆలయ పునరుద్ధరణను సాధారణ సివిల్ కాంట్రాక్టు పనిగా చూడకూడదు. ఒక అపురూప వైదిక, చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు భద్రంగా అందించే పరిరక్షణ యజ్ఞంగా భావించాలి. శాసనం నిలిస్తేనే నేల చరిత్ర నిలుస్తుంది. శిల్పం నిలిస్తేనే జాతి సంస్కృతి నిలుస్తుంది. సంప్రదాయం బతికితేనే క్షేత్ర వైభవం కలకాలం వర్ధిల్లుతుంది. ఆగమం మార్గదర్శిగా.. వాస్తు పునాదిగా.. శిల్పం రూపంగా.. సంప్రదాయం అంతఃప్రాణంగా.. ఆధునిక శాస్త్ర సాంకేతికత రక్షణ కవచంగా సాగే సమన్వయ జీర్ణోద్ధరణే ధర్మపురి నారసింహ క్షేత్రానికి అసలైన గౌరవం. అదే మన పూర్వీకులు అందించిన అమూల్య వారసత్వాన్ని భావితరాల చేతుల్లో భద్రంగా పెట్టే నిజమైన బాధ్యత.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెల్లవారక ముందే..

## వార్తను గుమ్మానికి చేర్చే వారధులు!

### నేడు అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం



ఆధునిక సమాజంలో సమాచార ప్రపంచం అనూహ్య వేగంతో మారుతోంది. స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికల ద్వారా సమాచారం క్షణాల్లో ప్రపంచమంతా చేరుతోంది. ప్రత్యక్ష ప్రసారాలు, ఎప్పటికప్పుడు వచ్చే తాజా సమాచారం, బ్రేకింగ్ న్యూస్ ప్రజలను డిజిటల్ మాధ్యమాల వైపు ఆకర్షిస్తున్నాయి. ఈ వేగంతో సంప్రదాయ ప్రింట్ మీడియా పోటీ పడటం సవాలుగా మారింది. అయినప్పటికీ ఉదయం లేవగానే చేతిలో పత్రిక ఉండాలనుకునే పాఠకులు ఇప్పటికీ ఉన్నారు. ఆ పత్రికను ముద్రణాలయం నుంచి పాఠకుడి గుమ్మం వరకు చేర్చే చివరి, అత్యంత కీలకమైన వారధి పేపర్‌బాయ్. సెప్టెంబర్ 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం సందర్భంగా.. ప్రతిరోజూ ప్రపంచాన్ని మన గుమ్మం ముందు ఉంచుతున్న వారి శ్రమను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా తెలుసుకోవాలంటే వార్తాపత్రికే ప్రధాన ఆధారం. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు పనిచేశాయి. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు వివరించడం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాయి. దిన, వార, పక్ష, మాస పత్రికలతో పాటు సాహిత్యం, విద్య, ఉపాధి, పరిశోధన, సినిమా, హాస్యం, విజ్ఞానం, ఆధ్యాత్మికతకు ప్రత్యేక పత్రికలు ఉండేవి. 'చందమామ', 'బాలమిత్ర', 'బొమ్మరిల్లు' వంటి బాలల పత్రికలు ఎన్నో తరాల బాల్య జ్ఞాపకాల్లో భాగమయ్యాయి. సమాచార వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో ఉదయం రావాల్సిన పత్రిక మధ్యాహ్నానికి పాఠకుడి చేతికి చేరిన సందర్భాలూ ఉండేవి. కాలక్రమంలో పత్రికా రంగం విస్తరించింది. ప్రచురణ కేంద్రాలు పెరిగాయి. ముద్రణ వేగం పెరిగింది. రవాణా, పంపిణీ వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. తెల్లవారకముందే పత్రికను పాఠకుడి గుమ్మానికి చేర్చే వ్యవస్థ ఏర్పడింది. ఈ మొత్తం వ్యవస్థలో చివరి అంచున నిలబడి పత్రికను పాఠకుడి చేతికి అందించే బాధ్యతను భుజాన వేసుకున్నవాడే పేపర్‌బాయ్. పాత్రికేయులు రోజంతా తిరిగి వార్తలను సేకరిస్తారు. ఉప సంపాదకులు వాటిని తీర్చిదిద్దుతారు. సంపాదకుల పర్యవేక్షణలో పేజీలు సిద్ధమవుతాయి. ముద్రణ యంత్రాల్లో పత్రిక రూపుదిద్దుకుంటుంది. కానీ ఆ పత్రిక పాఠకుడి చేతికి చేరకపోతే ఆ మొత్తం శ్రమ అసంపూర్ణమే. అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే పంపిణీ వాహనాల కోసం ఎదురుచూడటం.. వచ్చిన పత్రిక కట్టలను విప్పడం.. అనుబంధాలు, ప్రత్యేక సంచికలను ప్రధాన పత్రికలో అమర్చడం.. చందాదారుల వారీగా పత్రికలను వేరు చేయడం.. ఆ తర్వాత సైకిల్, ద్విచక్ర వాహనం లేదా కాలినడకన వీధివీధి తిరగడం వారి నిత్యకృత్యం. ప్రపంచం ఇంకా నిద్రలో ఉండగానే వారి రోజు మొదలవుతుంది. ఇంటింటికీ ఆగి పత్రికను ముంగిట్లో వేయడం.. గేట్ల మధ్య నుంచి అందించడం.. పై అంతస్తుల్లోకి విసరడం.. ఏ ఇంటికి ఏ పత్రిక వేయాలో గుర్తుపెట్టుకోవడం.. ఇదంతా వారికి రోజువారీ జీవితంలో భాగమే. ఎండైనా.. వానైనా.. చలైనా.. పండుగైనా.. పత్రిక మాత్రం పాఠకుడి గుమ్మానికి చేరాల్సిందే. పేపర్‌బాయ్ పని ఎంతోమందికి జీవనోపాధి. మరికొందరికి చదువుకు ఆసరా. కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు తెల్లవారుజామున పత్రికలు పంచి, ఆ తర్వాత కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా కనిపిస్తుంటారు. ఉదయం పత్రికల పంపిణీ పూర్తిచేసి మరో ఉపాధికి వెళ్లేవారూ ఎందరో ఉన్నారు. జీవితంలో ఉన్నతస్థాయికి చేరిన పలువురు ప్రముఖుల బాల్యం, విద్యార్థి జీవితాల్లోనూ వార్తాపత్రికల పంపిణీతో అనుబంధం ఉన్న ఉదాహరణలు కనిపిస్తాయి. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిన్నతనంలో వార్తాపత్రికల పంపిణీ చేసిన విషయం ఆయన జీవితచరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది. అలాంటి అనుభవాలు ఏ పనీ చిన్నది కాదనే జీవిత సత్యాన్ని చాటుతాయి. పేపర్‌బాయ్ జీవితం వెండితెరకూ కథావస్తువైంది. జయశంకర్ దర్శకత్వంలో సంతోష్ శోభన్, రియా సుమన్, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'పేపర్ బాయ్' తెలుగు చిత్రం 2018 ఆగస్టు 31న విడుదలైంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రంలో పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణ, బిత్తిరి సత్తి, విద్యుల్లేఖ రామన్, కల్పలత తదితరులు నటించారు. సామాజిక మాధ్యమాలు వేగంగా విస్తరించినప్పటికీ ప్రింట్ మీడియా ప్రాధాన్యం పూర్తిగా కనుమరుగైపోలేదు. విశ్లేషణాత్మక కథనాలు, సంపాదకీయాలు, స్థానిక సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రకటనలు, ఉద్యోగ సమాచారం వంటి అనేక అంశాల్లో ముద్రిత పత్రికలకు ఇప్పటికీ ప్రత్యేక పాఠక వర్గం ఉంది. పత్రికా రంగానికి ప్రభుత్వాలు వివిధ రూపాల్లో ప్రోత్సాహం అందిస్తున్నాయి. పాత్రికేయుల సంక్షేమం గురించి చర్చ జరుగుతోంది. పత్రికా సంస్థల మనుగడపై చర్చ జరుగుతోంది. కానీ ఈ వ్యవస్థలో చివరి మెట్టుగా నిలిచే పేపర్‌బాయ్‌ల సంక్షేమం గురించి కూడా అంతే స్థాయిలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. పేపర్‌బాయ్‌లలో చాలామంది అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. తెల్లవారుజామున ప్రయాణం, ప్రతికూల వాతావరణం, రోడ్డు ప్రమాదాల ముప్పు, తక్కువ ఆదాయం వంటి అనేక ఇబ్బందుల మధ్య వారు తమ పని కొనసాగిస్తున్నారు. చదువుకోసం, కుటుంబ పోషణ కోసం, ఆర్థిక స్వావలంబన కోసం ఈ వృత్తిని ఎంచుకున్న వారెందరో ఉన్నారు. వారు చేస్తున్న పని చిన్నదా.. పెద్దదా అన్నది ప్రశ్న కాదు. పత్రికను పాఠకుడి చేతికి చేర్చే వారి శ్రమ లేకుండా ప్రింట్ మీడియా ప్రయాణం పూర్తికాదన్నదే వాస్తవం. అందుకే పత్రికా యాజమాన్యాలతో పాటు ప్రభుత్వాలు కూడా వారి సేవలను గుర్తించి సంక్షేమం, బీమా, ప్రమాద భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలి. పాత్రికేయుడు వార్తను వెతుకుతాడు.. సంపాదకుడు దానికి రూపమిస్తాడు.. ముద్రణ యంత్రం అక్షరాలుగా మలుస్తుంది.. కానీ ఆ అక్షర ప్రపంచాన్ని ప్రతి ఉదయం మన గుమ్మానికి మోసుకొచ్చేది పేపర్‌బాయే. ఊరు మేల్కొనేలోపే అతడి పని మొదలవుతుంది.. మనం పత్రిక తిరగేస్తున్న సమయానికి అతడి ప్రయాణం ఎన్నో గడపలు దాటిపోతుంది. ఆ నిరుపమాన సేవకు గుర్తింపే అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవానికి అసలైన అర్థం.

